



# విజయభాను

44th వార్షికోత్సవం విజయభాను


విశాఖపట్నం, ఆదివారం 11-10-2020 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 44 సంచిక : 29 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## ఉపాధ్యాయులకు శుభవార్త



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపాధ్యాయులకు శుభవార్త చెప్పింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధ్యాయ బదిలీలకు ఆమోదం తెలిపారు. ఈమేరకు సంబంధిత ఫైలుపై శనివారం ఆయన సంతకం చేశారు. రెండు మూడు రోజుల్లో బదిలీల అంశంపై ఉత్తర్వులు వెలువడనున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 29-2-2020 నాటికి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులందరూ బదిలీలకు అర్హులు అని తెలిసింది. వెబ్ కౌన్సిలింగ్ ద్వారా ఈ బదిలీలు కార్యక్రమం చేపట్టనున్నారు. కాగా, టీచర్ల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మూడేళ్లుగా ఎదురు చూస్తున్న బదిలీల అంశంపై సీఎం జగన్ నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కె.వెంకట్ రామ్ రెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఈవోగా బాధ్యతలు చేపట్టిన జవహర్‌రెడ్డి



తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం ఈవోగా జవహర్‌రెడ్డి శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 6గంటలకు అలిపిరి పాదాల మండపం వద్ద నుంచి కాలినడకన కొండపైకి చేరుకున్నారు. అనంతరం వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి చేరుకుని కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో తితిదే ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డికి వేదపండితులు ఆశీర్వచనం అందించారు. ఆ తర్వాత అన్నమయ్య భవన్‌లో తితిదే ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఇంతకు ముందు తితిదే ఈవోగా ఉన్న అనిల్ కుమార్ సింఘాల్‌ను రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేసిన విషయం తెలిసిందే.

### పాక్ నుంచి ఆయుధాలు సరఫరా..

## స్వాధీనపరుచుకున్న భారత్ ఆర్మీ



న్యూఢిల్లీ : ఉత్తర కశ్మీర్‌లోని కీరన్ సెక్టార్‌లో భారతీయ ఆర్మీ .. పాకిస్థాన్ నుంచి అక్రమంగా సరఫరా అవుతున్న ఆయుధాలను స్వాధీనం చేసుకున్నది. పాకిస్థాన్ ఆర్మీ సాయంతో పీవోకేలో ఉగ్రవాదులు ఆయుధాలు సరఫరా చేస్తున్న తరుణంలో భారత ఆర్మీ పట్టుకున్నది. నాలుగు ఏకే 74 రైఫిళ్లు, 8 మ్యాగ్జిన్లు, 24o0 ఏకే రైఫిల్ అమ్యూనిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కిషన్ గంగా నది సమీపంలో ఉగ్రవాదులు ఆయుధాలు సరఫరా చేస్తున్నట్లు భారత ఆర్మీ దళాలు గుర్తించాయి. దీంతో వెంటనే ఇండియన్ ఆర్మీ జమ్మూకశ్మీర్ పోలీసులతో కలిపి జాయింట్ ఆపరేషన్ మొదలుపెట్టింది. కిషన్ గంగా నదికి అవతల వైపు పీవోకే ప్రాంతంలో ముగ్గురు ఉగ్రవాదులు ఓ ట్యూబ్‌ను తాడుకు కట్టి ఆయుధాలు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. అయితే

తరువాయి 2లో..

# ఏపీ ఎంసెట్ ఫలితాలు విడుదల

- ఇంజినీరింగ్‌లో 84.78 శాతం ఉత్తీర్ణత
- అగ్రికల్చర్, మెడిసిన్‌లో 91.77 శాతం ఉత్తీర్ణత

అమరావతి : ఏపీ ఎంసెట్-2020 ఫలితాలు శనివారం విడుదల అయ్యాయి. రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఎంసెట్ ఫలితాలను విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ విడుదల చేశారు. ఇంజనీరింగ్‌లో 84.78 శాతం, అగ్రికల్చర్, మెడిసిన్ విభాగంలో 91.77 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మంత్రి వెల్లడించారు. విద్యార్థుల మొబైల్ నంబర్లకు కూడా ర్యాంకుల వివరాలు వస్తాయని మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. విద్యార్థులు ఎంసెట్ ఫలితాలను www.sakshiedu-cation.com లో చూసుకోవచ్చు.

ఆన్‌లైన్ (సీబీటీ) విధానంలో జరిగిన ఈ పరీక్షలను హైదరాబాద్‌తో పాటు ఏపీలోని మొత్తం 47 నగరాల్లో 118 కేంద్రాల్లో నిర్వహించారు. గత నెల సెప్టెంబర్ 17వ తేదీ నుంచి 25 వరకు ఉదయం, మధ్యాహ్నం మొత్తం 14 సెషన్లలో పరీక్షలు జరిగాయి. 9 సెషన్లలో జరిగిన ఇంజనీరింగ్ విభాగానికి 1,85,946 మంది దరఖాస్తు చేయగా 1,56,899 మంది (84.38 శాతం) పరీక్ష రాశారు. ఈనెల 23వ తేదీ నుంచి 25 వరకు అగ్రి, మెడికల్ విభాగం పరీక్షలు జరగ్గా మొత్తం 87,652 మందికి గాను 75,834 (86.52%) మంది హాజరయ్యారు. ఇంజనీరింగ్ విభాగంతో 1,33,066 మంది విద్యార్థులు, అగ్రికల్చర్, మెడిసిన్ విభాగంలో 69,616 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

**ఇంజినీరింగ్‌లో ర్యాంకర్లు వీరే**

ఫస్ట్ ర్యాంక్ : వావిలపల్లి సాయినాథ్(విశాఖ)
రెండో ర్యాంక్ : కుమార్ సత్యం (హైదరాబాద్)
మూడో ర్యాంక్: గంగుల భువన్‌రెడ్డి(ప్రొద్దుటూర్)
నాలుగో ర్యాంక్: లిఖిత్ రెడ్డి(హైదరాబాద్)
ఐదో ర్యాంక్: కౌశల్ కుమార్( సికింద్రాబాద్)
ఆరో ర్యాంక్ : శ్రీహర్ష (రాజమండ్రి)
ఏడో ర్యాంక్: సాయితేజ వారణాసి ( హైదరాబాద్)

## విద్యావ్యవస్థలో సమూల మార్పులు

### మంత్రి ఆదిమూలపు సురేష్



విజయవాడ : విద్యకు పేదరికం అడ్డుకాకూడదనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహ న్‌రెడ్డి 'జగనన్న విద్యాకానుక' పథకాన్ని ప్రారం భించారని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తుంటే.. ప్రతిపక్షం జీర్ణించుకోలేకనే బురదజల్లుతోందని ఆయన దుయ్యబట్టారు. ప్రజలు సంతోషంగా ఉంటే ప్రతిపక్షం ఆనందంగా ఉండలేదని విమర్శించారు.'జగనన్న విద్యాకానుక'పై ఇతర రాష్ట్రాలు కూడా ఆరా తీస్తున్నాయని పేర్కొన్నారు. బడ్జెట్‌లో 16 శాతం విద్యాభివృద్ధికే కేటాయిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిది. డ్రాప్ ఔట్ శాతం తగ్గించి మెరుగైన విద్య అందించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చాం.

ఉన్నత విద్య అందరికీ అందేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. 'దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో 'జగనన్న విద్యాకానుక' అమలవుతోంది. రూ.650 కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం. ఈ కిట్‌లో అందిస్తున్న స్కూలు బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు మొదలైన వాటి ఖర్చులని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందని సురేష్ తెలిపారు. గతంలో కేవలం ఎనిమిదో తరగతి వరకు మాత్రమే యూనిఫామ్స్ ఇచ్చారని, ఇప్పుడు పదవ తరగతి వరకు కూడా అందిస్తున్నామని చెప్పారు. జగనన్న చెప్పాడంటే చేస్తాడంతే అని ప్రజలంతా భావిస్తున్నారని మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు.

## రాగల 24 గంటలలో భారీ వర్షాలు

విశాఖపట్నం : తీవ్ర అల్పపీడనం కారణంగా రాగల 24 గంటలలో భారీ వర్షాలు పడతాయని, వాతావరణ శాఖ సూచన మేరకు ముందస్తు చర్యగా జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తీర ప్రాంతాలలో మత్స్య కారులు ఎవరూ సముద్రంలోకి వెళ్లకుండా మత్స్యశాఖ అధికారులు అప్రమత్తం గావించాలన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెం . 0891 -- 2590102 , 0891- 2590100 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం గావించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తీర ప్రాంత మండలాలలో మత్స్యశాఖ అధికారులు , ఎఫ్.డి.ఒ.లు, ఎ.డి.లు. పర్యటించి మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. జాయింట్ డైరెక్టర్, ఫిషరీస్, ఆ మేరకు తగు చర్యలు చేపట్టాలన్నారు. తీర ప్రాంత మండాలలోని గ్రామ సచివాలయాలలోని మత్స్యశాఖ మరియు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్స్ అప్రమత్తంగా వుండాలన్నారు. ఎవరైన సముద్రంలోకి వేటకి వెళ్లివుంటే వారిని సత్వరమే వెనక్కి

రప్పించాలని చెప్పారు. వారంతా సురక్షిత ప్రాంతాలలో వుండేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు సముద్రం అల్లకల్లోలంగా వుంటుందని మత్స్యకారులెవరూ సముద్రంలోకి పోరాదన్నారు. తేది 11.10.20, 12.10.20 లలో పరిస్థితి ఇలాగే కొనసాగుతూ వుంటుందని. జిల్లా అధికారులంతా అందుబాటులో వుండి అవసరమైన జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం కలెక్టరు కార్యాలయంలో కంట్రోల్ రూం 24 గంటలు పని చేసేలా తగు చర్యలు చేపట్టాలని డి.ఆర్.ఒ.ని ఆదేశించారు.

## కండలేరు జలాశయాన్ని పరిశీలించిన మంత్రి అనిల్

నెల్లూరు: ఆంధ్రప్రదేశ్ జల వనరులశాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ జిల్లా ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి కండలేరు జలాశయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కండలేరులో ప్రస్తుత నీటి మట్టం 53 టీఎంసీలు. తెలుగు గంగ చరిత్రలో తొలిసారిగా 60 టీఎంసీల నీటిని నిల్వచేస్తాం. జిల్లాలో ప్రతి గ్రామానికి తాగు, సాగు నీరు అందిస్తాం. వరుసగా రెండేళ్లు జలాశయాలు నిండు కుండను తలపిస్తున్నాయి.

ఈ క్రమంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి. జలాశయాల కింద ముంపుకు గురయ్యే గ్రామాల ప్రజలను తక్షణం పునరావాసాలకు తరలించాలి' అని అధికారులకు సూచించారు.




# జీవితాలను పణంగా పెట్టారు ... మీ సేవలు మరువలేం ...

శ్రీకాకుళం : మీరు జీవితాలను పణంగా పెట్టారు... మీ సేవలు మరువలేం ... అన్నారు జిల్లా కలెక్టర్ జె నివాస్. జెమ్స్ ఆసుపత్రిలో కోవిడ్ 19 సేవలలో పాల్గొని విధులు ముగించుకుని ఇళ్ళకు తిరిగి వెళుతున్న కోవిడ్ వారియర్స్ కు శని వారం జెమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. మార్చి నెల నుండి కరోనాతో పోరాడుతున్నాం. కరోనా వైరస్ సోకిన వారికి సేవల కోసం మూడు నెలలకు తాత్కాలికంగా ఉద్యోగాల్లో నియమించామని, మీరు అందరూ జీతాల కోసం కాకుండా జీవితాలను పణంగా పెట్టి సేవలందించారని ప్రశంసించారు. మీ అందరికి ప్రత్యేక ధన్యవాదాలు అని అన్నారు. కరోనా సమయంలో బంధువులు కూడా దగ్గర చేరని సమయంలో, అంత్యక్రియలకు కూడా రాకుండా ఉన్నటువంటి పరిస్థితిలో కోవిడ్ వారియర్స్ గా మీరు అందించిన సేవలు మరువలేనివి అన్నారు. అనవసర భయంతో, అవగాహన లోపంతో సరైన సేవలు వినియోగించు కోలేకపోయారని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న మీరందరూ ధైర్యంగా సేవ చేయాలనే దృక్పథంతో పని చేశారని, ప్రజల ప్రాణాలు కాపాడడానికి ముందుకు వచ్చిన మీ అందరికి జిల్లా రుణపడి ఉంటుందని అన్నారు. మిగతా వ్యాధుల వేరు - కరోనా వ్యాధి వేరు. ఏ జబ్బుకు అయినా సేవ చెయ్యడానికి బంధువులు వచ్చేవారు కానీ కరోనా వ్యాధి వస్తే బంధువులు ఉన్నారో లేరో అన్నటు వంటి పరిస్థితి అటువంటి సమయంలో మీరే వీరికి అండా దండాగా ఉంటూ బంధువులు, ఆప్తులు కూడా మీరే అయ్యారని కొనియాడారు. కరోనా రోగులకు ముఖ పరిచయం లేని బంధువులుగా మిమ్మల్ని వారు గుర్తు తెచ్చుకుంటారని పేర్కొన్నారు. రోగులకు సిబ్బంది తమ చేత్తో తినిపించే సందర్భాలు కూడా నాకు తెలుసు అన్నారు. రోగుల ప్రాణాలు కాపాడడంలో ప్రత్యేక పాత్ర మీ అందరిదీ అని కొనియాడారు. కరోనా సమయంలో ఎఫ్.ఎన్.ఓ, ఎమ్.ఎన్.ఓలు చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయని పేర్కొన్నారు. రోగులు రాగానే క్షణం కూడా ఆలస్యం చేయకుండా వీల్ చైర్లో బెడ్ వరకు తీసుకువెళ్లి అవసరమైన సపరిచర్యలు అందించడంలో ముందున్నారని ప్రశంసించారు. అనేక ప్రాంతాల్లో రోగులు చెట్లకింద, వరండాలో, అంబులెన్స్ లో చనిపోయిన దుర్ఘటనలు చూసామని, ఇలా శ్రీకాకుళం జిల్లాలో జరగ కూడదు అని నిర్ణయించుకొని జిల్లా అధికారులకి ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. మన జిల్లాలో ఉన్న డాక్టర్లు, నర్సులు, సిబ్బంది సహాయ సహకారాలతో కోవిడ్ నుండి కాస్త ఉపశమనం పొందడం జరిగిందన్నారు. కోవిడ్ సమయంలో సేవలు అందించి, కోవిడ్ సర్టిఫికెట్ పొందిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ సమయంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వమని ప్రభుత్వానికి కూడా సిఫార్సు చేస్తున్నామని, ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందిస్తుందనే నమ్మకం ఉందని అన్నారు. ప్రతీ రోగిని కూడా నా బంధువులానే చూసుకున్నానని, మీరు కూడా అలానే చూసుకున్నారని పేర్కొన్నారు. తద్వారా అన్ని జిల్లాల కంటే కోవిడ్ నివారణలో మనం ముందున్నామని, మీ అందరూ రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లాకు మంచి పేరు సంపాదించి పెట్టారని అంటూ మరోసారి మీ అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపారు.

రెవిన్యూ విభాగం జాయింట్ కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా గత నాలుగు నెలల నుండి ఆసుపత్రి సిబ్బంది అందించిన కోవిడ్ సేవలు గురించి ఎంత చెప్పినా తక్కువే అన్నారు. జిల్లా అధికారులు మీ సేవలు గుర్తించారని, మీకు ఈ కోవిడ్ సర్టిఫికెట్ అన్నది మున్ముందు ప్రభుత్వ ఉద్యోగాలకు ఉపయోగపడుతుందని చెప్పారు.

వార్డు, గ్రామ పంచాయతీ విభాగం జాయింట్ కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా కోవిడ్ మహమ్మారికి భయపడి స్వంత కుటుంబ సభ్యులే రోగుల దగ్గరికి చేరడానికి ధైర్యం చేయలేదని, అటువంటి సమయంలో మీరు అందరూ కలసి ప్రాణాలకు తెగించి కోవిడ్ సేవలు అందించారని అన్నారు. మనందరం ఇలా పనిచేయడానికి మన జిల్లా కలెక్టర్ కృషి మరువలేనిది అని అన్నారు. కలెక్టర్ ముందు చూపు వలన కరోనా కేసులు, మరణాల సంఖ్య పెరగకుండా జిల్లాని మీ అందరి సహాయ సహకారాల వలన నెరవేరింద అని అన్నారు.

కోవిడ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమంత్ మాట్లాడుతూ మొట్ట మొదటి గా ఏప్రిల్ 23 న మొదటి కోవిడ్ కేసుతో ప్రారంభమైన జెమ్స్ ఆసుపత్రి సేవలు ఇప్పటి వరకు 5 వేల 2 వందల మందికి సేవలు అందించిందన్నారు. ఇప్పటి వరకు 4900 మంది కోవిడ్ తగ్గు ముఖం పట్టి తమ ఇళ్లకు క్షేమంగా చేరుకున్నారని తెలిపారు. ఏ సమయానికి ఏమి కావాలో, ఎలాంటి సహాయ సహకారాలు కావాలో ప్రతీ క్షణం రాత్రనక, పగలనక మాకు సలహాలు, సూచనలు ఇచ్చి ప్రోత్సాహించిన కలెక్టర్ నివాస్ ,జాయింట్ కలెక్టర్లు శ్రీనివాసులు, సుమిత్ కుమార్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కోవిడ్ వారియర్స్ కు ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె.సి.చంద్రనాయక్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవి కుమార్, జెమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి, జెమ్స్ వైద్యులు డాక్టర్ సుధీర్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి , డిప్యూటి ఆర్.ఎం.ఓ డాక్టరు ప్రవీణ్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీవారికి కానుకగా బంగారు శఠారి



తిరుమల : కలియుగ వైకుంఠదైవం వెంకటేశ్వరస్వామికి ఓ భక్తులు బంగారు శఠారి బహుమతిగా అందించారు. చెన్నైకి చెందిన భాష్యం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ తరపున టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు కృష్ణమూర్తి వైద్యనాథన్ శనివారం ఉదయం తిరుమల శ్రీవారికి రూ.35.89 లక్షల విలువైన బంగారు శఠారిని కానుకగా సమర్పించారు.

ఈ మేరకు ఈ కానుకను శ్రీవారి ఆలయంలో టీటీడీ ఏఈఓ ధర్మారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు డిప్యూటీ సీఎం పన్నీర్ సెల్వం కూడా పాల్గొన్నారు. శ్రీవారి ఉత్సవాల ఊరేగింపు సందర్భంలో ఈ శఠారిని వినియోగించనున్నారు.

# రక్త దానం చెయ్యండి...ప్రాణాలను కాపాడండి



ములగాడ: ప్రతిఒక్కరూ ఆపదలో ఉన్నవారికి రక్త దానం చేసి ప్రాణ దాతల గా మారాలని పశ్చిమ నియోజకవర్గం 62వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థి నీలాపు జోగి అన్నారు. తెదేపా నగరంలోని జిల్లా ఎన్టీఆర్ భవన్ లో తెదేపా శ్రేణుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా రక్త దాన శిబిరానికి పశ్చిమ నియోజకవర్గ 62 వార్డ్ తెదేపా కార్పొరేటర్ అభ్యర్థి నీలాపు జోగి ఆధ్వర్యంలో నాయకులు,కార్యకర్తలు, యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోగి మాట్లాడుతూ రక్త దానంతో ఎంతో మందికి ప్రాణ దానం చెయ్యొచ్చునని, అపోహలు వీడి ప్రతీ ఒక్కరు రక్త దానం చేసి ఆపద లో ఉన్నవారిని ఆదుకోవాలని కోరారు. పశ్చిమ తెదేపా శాసనసభ్యులు గణబాబు సూచనలు మేరకు, తెదేపా ఎమ్మెల్యే, వెండితెర హీరో నందమూరి బాలకృష్ణ పిలుపు మేరకు విశాఖ జిల్లా ఎన్టీఆర్ భవన్ లో జరిగిన మెగా రక్తదాన శిబిరం లో పాల్గొని రక్త దానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 62వవార్డ్ నాయకులు మాలిబాబు,గంగాధర్, తరుణ్ కుమార్, నానాజీ, భార్గవ్, సూరిబాబు, కిరణ్, ప్రసాద్, పవన్ కుమార్ యువత హాజరయ్యారు.

# ఎంసెట్‌లో మొదటి ర్యాంకు సాధించిన విశాఖ విద్యార్థి



మధురవాడ : ఆంధ్రప్రదేశ్ ఎంసెట్ 2020 ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శనివారం ఉదయం విడుదల చేశారు. అయితే ఈ ఫలితాల్లో విశాఖ విద్యార్థి వావిలాపల్లి సాయినాధ్ సత్తా చాటాడు.ఎండాడ గీతం కళాశాల రోడ్డులోని మైఫేర్ అపార్ట్ మెంట్ లో నివాసముంటున్న వావిలపల్లి సాయినాథ్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించాడు. సాయినాథ్ మొదటి ర్యాంకు సాధించడం పట్ల ఆయన తండ్రి రమేష్, కుటుంబ సభ్యులు, బంధువులు అభినందించారు. శ్రీ చైతన్య కళాశాలలో చదువుతున్న సాయినాథ్ ను కళాశాల సిబ్బంది, తోటి విద్యార్థులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సాయి నాథ్ మాట్లాడుతూ ఎంసెట్ ఫలితాల్లో మొదటి ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉంది. అలాగే మొన్న విడుదలైన జె ఈ అడ్వాన్స్ లో 173 వ ర్యాంకు,జే.ఈ మైన్స్ లో 104 వ ర్యాంకులు సాధించడం చాల సంతోషంగా ఉందని తెలిపారు. సాయినాథ్ 10 వ తరగతి వరకు శ్రీ చైతన్య శ్రీకాకుళం లో చదివి అనంతరం ఇంటర్ రెండు సంవత్సరాలు కూడా శ్రీ చైతన్య రామన్ బ్లాక్ 3 విశాఖ లో చదివాడు. ఈ ర్యాంక్ సాధించడానికి కాలేజి యాజమాన్యం, తల్లితండ్రుల ప్రోత్సాహం వలన సాధించానని తెలిపారు.

# అర్హులైన వృద్ధులకు పింఛన్లు మంజూరు చేయాలి

నాతవరం : నాతవరం మండలం గునుపూడి గ్రామానికి చెందిన ఆరుగురు వృద్దులకు కొన్ని రాజకీయ కారణాల వల్ల వృద్యాప్య పింఛన్లు మంజూరు చేయలేదని బిజెపి రాష్ట్ర ప్రధానమంత్రి కళ్యాణ్ కారి ప్రచార కార్యదర్శి, మండల బిజెపి అధ్యక్షులు డాక్టర్ లాలం వెంకటరమణారావు అన్నారు. మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు వేముల సూర్యనారాయణమూర్తి ద్వారా ఈ విష యాన్ని తెలుసుకున్న ఆయన వెంటనే శనివారం నాతవరం ఎంపిడిఒ యాదగిరీశ్వరరావుకు కలిసి లబ్ధిదారుల యొక్క దరఖాస్తులు అందజేశారు. ఈ దరఖాస్తులు పరిశీలించిన ఎంపిడిఒ దరఖాస్తులు సక్రమంగా ఉన్నాయని, వారికి త్వరలో పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి ఉపాధ్యక్షులు పోలుపర్తి సూరిబాబు, తానారి శ్రీనివాస్, దేవాడ చిన్న తదితరులు పాల్గొన్నారు.

# పూడిమడక తీరంలో గుర్తుతెలియని మృతదేహం



అచ్యుతాపురం : మండలంలో పూడిమడక సముద్ర తీరానికి శనివారం ఉదయం గుర్తుతెలియని మృతదేహం (25 - 30 సం .) కొట్టుకొచ్చిందని ఎస్ఐ జి లక్ష్మ ణరావు తెలిపారు. మృతదేహంపై పింక్ & బ్లూ కలర్ టి షర్ట్ , నేవి బ్లూ జీన్స్ ప్యాంటు దుస్తులు ఉన్నాయి. ఆనవాలును గుర్తుపట్టి ఎవరికైన తెలిసిన వ్యక్తి అయితే పోలీస్ స్టేషనుకు సంప్రదించాలన్నారు.

మృతదేహంపై స్థానిక విఆర్ఓ ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం కేసు నమోదు చేశామన్నారు.

మొదటి పేజీ తరువాయి

## పాక్ నుంచి ఆయుధాలు సరఫరా..

# స్వాధీనపరుచుకున్న భారత్ ఆర్మీ

ఆ ప్రాంతానికి వెళ్లిన భద్రతా దళాలు.. ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి.

ఈ ఏడాది సరిహద్దు చొరబాట్లను చాలా వరకు అడ్డుకున్నట్లు చినార్ కార్ప్స్ లెఫ్టినెంట్ జనరల్ బీఎస్ రాజు తెలిపారు. గత ఏడాది పాకిస్థాన్ నుంచి 130 మంది అక్రమంగా ప్రవేశించారని, ఈ ఏడాది ఆ సంఖ్య 30 కన్నా తక్కువగానే ఉందన్నారు. ఈ పరిస్థితి వల్ల అంతర్గతంగా కూడా భద్రత పెరుగుతుందన్నారు. మన దళాలు నిత్యం అప్రమత్తంగా ఉంటున్నాయని, నిఘా డివైస్‌ల ద్వారా పాక్ నుంచి స్మగ్లింగ్ అయిన ఆయుధాలను పట్టుకున్నామని, ఇది ఆ దేశ ఉద్దేశాలను తెలుపుతుందని ఆయన అన్నారు. పాక్ ప్రదర్శిస్తున్న కుత్సిత బుద్ధిని భవిష్యత్తులోనూ ఎదుర్కొటామని లెఫ్టినెంట్ జనరల్ బీఎస్ రాజు తెలిపారు. పాకిస్థాన్ వైపు ఉన్న లాంచ్ ప్యాడ్లలో సుమారు 300 మంది ఉగ్రవాదులు ఉన్నట్లు తెలుస్తోందన్నారు.

# ముఖ్యమంత్రి జగన్ ని... ఎమ్మెల్యే నాగిరెడ్డి ని విమర్శిస్తే ఊరుకోము



గాజువాక : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కానీ స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కానీ విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని టీడీపీ పార్టీ మహిళలకు గాజువాక వై వైఎస్ ఆర్ సిపి పార్టీ మహిళలు హెచ్చరించారు . శనివారం గాజువాక వైసీపీ పార్టీ కార్యక్రమంలో పార్టీ ముఖ్య మహిళా నాయకురాలు పల్లా చిన తల్లి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పల్లా చినతల్లి మాట్లాడుతూ గత నాలుగు రోజుల కిందట వాంబే కోలనిలో ఒక ఫాస్టర్ ఒక మైనర్ బాలికపై అత్యాచారాయత్నం చేయడం చాలా దురదృష్టకరం అని అన్నారు. ఒక క్రిస్టియన్ (పాస్టర్) తప్పు చేస్తే అది రాష్ట్ర ప్రభుత్వం పైన సీఎం జగన్మోహన్ రెడ్డి పైన టీడీపీ పార్టీ నాయకులు , మహిళలు నోటికి ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో దళితులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి నాయకత్వం లోనే దళితులకు న్యాయం జరుగుతుందని అన్నారు. గంగులూరి రోజారాణీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ అన్యాయం జరిగినా అది తమ నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వల్లే జరిగిందని టీడీపీ నేతలు రొడెక్కుతున్నారని మండిపడ్డారు. ఒక మైనర్ బాలికపై అత్యాచారాయత్నం జరిగితే ఆ బాలికకు అండగా నిలిచి సానుభూతి తెలపకుండా అది ఒక చర్చ్ ఫాస్టర్ చేసేడు అది జగన్ మోహన్ రెడ్డి అండచూసుకుని అని పిచ్చి పేలపనలు పేలుతున్నారాని ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో దళితులపై ఎన్ని ఆగత్యాలు , దారుణాలు , దాడులు జరిగాయో అందరికి తెలిసిందే అన్నారు. టీడీపీ మహిళలకు , నాయకులకు , కార్యకర్తలకు మీరు మీ రాజకీయ లబ్ధికోసం కానీ మీ అధినేత మెప్పుకోసం కానీ ప్రజలలో మీ మనుగడను కాపాడుకునేందుకు కానీ తమ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కానీ స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కానీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కానీ విమర్శిస్తే వైసీపీ మహిళలు చూస్తూ ఉరుకోరని ఘాటైన వ్యాక్యల్తో హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య మహిళా నాయకురాళ్లు కటికల కల్పన , 73 వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థిని భూపతి రాజు సుజాత, శిరీష , మంత్రి మంజుల తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై జరుగుతున్న దాడులు

# అరికట్టడంలో ఘోర వైఫల్యం

## – సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ



విశాఖపట్నం : దళిత, మైనార్టీ, గిరిజన పక్షాన ఉన్నామంటూ ప్రచారం గుప్పిస్తున్న పాలకుల తీరు వారిపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో గోరవైఫల్యం చెందాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మూర్తి విమర్శించారు. మహిళలపై అత్యాచారాలు, దళితులపై దాడులు, హత్యలు నిరసిస్తూ వామపక్ష పార్టీలు, దళిత, మహిళా సంఘాల సంయుక్త నిర్వహణలో శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో సమావేశం జరిగింది. సమావేశానికి జె వి సత్యనారాయణ మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాల పాలనలో దళితులపై దాడులు అధికమయ్యా యని, మహిళలపై అత్యాచారాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు.దాడులను నిరసిస్తూ భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించు కొని పోరాటాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు సత్వర న్యాయం జరగడం లేదని, బాధితుల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు.

హత్రాస్ ఘటనా వెనక ఉన్న దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. సమాజంలో నిత్యం ఏదో ఓ చోటా దాడులు జరుగు తున్నాయని ముఖ్యంగా దళితులపై ఈ దాడులు మరింత అధికామయ్యాయని ఆరోపించారు. మున్ముందు వీటి నివారణకు చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పిఓడబ్ల్యు నేత లక్ష్మి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటూ పోరాటాలు నిర్వహించాలని, పాలకుల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో పోరాటాలు నిర్వహించాలని అన్నారు. సీపీఎం నాయకురాలు మణి మాట్లాడుతూ ఉమ్మడి కార్యాచరణ లో భాగంగా భవిష్యత్తులో నిర్వ హించే పోరాటంలో సీపీఎం పాల్గొంటుందని, మహిళపై జరుగుతున్న దాడులను ఆమె కందించారు. దళిత సంఘాల నేత బొడ్డు కళ్యాణరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య భారత దేశంలో వివిధ రూపాల్లో దాడులు అధికామయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కారణం ఏదైనా సమస్య మన అందరిదిగా భావించి పోరాటాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు రక్షణ లేని సమాజంలో అభద్రతా భావంలో జీవిస్తున్నామన్న భావనతో అందరం ఏకమై దాడులను ఎదుర్కోవాలని అన్నారు.

సీపీఐ ఎం ఎల్ నాయకులు గణేష్ పాండా మాట్లాడుతూ బావజాలంలో మార్పు రానంతవరకు ఇలాంటి దాడులు,అరాచకాలు జరుగుతూనే ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎ పి మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎ విమల మాట్లాడుతూ గో సంరక్షణ పేరుతో దాడులు అధికామయాయి, గోవులకు ఉన్న రక్షణ మహిళలకు లేదా అని ప్రశ్నించారు.

## విద్యాకానుక విజయవంతం సందర్భంగా

# వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



విశాఖపట్నం : ముఖ్యమంత్రి వర్యులు జగన్మోహన్ రెడ్డి విద్యకానుక పథకం ప్రవేశ పెట్టి విజయవంతం అయిన సందర్భంగా విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గం మొత్తం బైక్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ లో 29వ వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థి పురికిటి నారాయణరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ వైస్సార్సీపీ నాయకులు కేబుల్ సతీష్, చొల్లంగి శేఖర్, సారిపిల్లి వెంకట రమణ, పుటగెడ్డ వెంకట్రావు, బులెట్ రవి, ఎవన్ బీచ్ రాజు, కాయిత మధు, డోప్ప సూరి, టైలర్ రామ కృష్ణ, తమినేని శ్రీను, గోలగని సతీష్, ముపర్తి శేఖర్, విజయ్, మణి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో యువకుడు మృతి



భీమునిపట్నం : విద్యుత్ షాక్ తో యువకుడు మృతి చెందిన సంఘటన స్థానిక తగరపువలస లో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు ఇచ్చిన వివరాలు ప్రకారం సంతపేట కు చెందిన సంతోష్ స్థానిక తాతాధియేటర్ పక్కన ఉన్న ఎస్.ఎం.ఎస్ ప్రొటిన్ షాపు కోసం ఒక షాపు ఇటీవలే అద్దెకు తీసుకున్నాడు. కాగా శుక్రవారం రాత్రి పదిగంటలకు ఆషాపు ప్లెక్సీ బోర్డు బిగిస్తుండగా కరెంట్ వైర్లు తగిలి సంతోష్ షాక్ కు గురై అక్కడి కక్కడే మృతి చెందిన ట్లు పోలీసులు తెలిపారు. గతంలో ఈ షాపు రాములమ్మ ధియేటర్ వద్ద ఉండేదనీ ఈమధ్యనే ఇక్కడికి వచ్చాడనీ బంధువులు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## శిధిలమైన రోడ్లును

# పూర్తి స్థాయిలో బాగుచేయాలి



అచ్యుతాపురం : మండల కేంద్రమైన అచ్యుతాపురం నాలుగు రోడ్ల కూడలి నుండి నాలుగు రూట్లలో శిధిలమైన రోడ్లును పూర్తి స్థాయిలో బాగుచేయాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు రొంగలి రాము డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పూర్తిగా పాడైన రోడ్లును బాగుచేయాలని అధికారులను కలిసిన మనిషి ప్రాణం పోయేంత వరకు పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైన అధికారులు పూర్తి స్థాయిలో నాణ్యమైన రోడ్ల పనులను చేపట్టాలని సిపిఎం మండల కమిటి డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కూండ్రపు సోమునాయుడు, చేపల తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న విద్యాకానుక పేద పిల్లలకు వరం

## విశాఖ దక్షిణ శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్ కుమార్



విశాఖపట్నం : జగనన్న విద్యాకానుక పేద పిల్లలకు వరం అని విశాఖ దక్షిణ శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. శనివారం జగనన్న విద్యాకానుక విజయోత్సవాలను దక్షిణ నియోజక వర్గంలో ప్రజలకు వివరించేలా బైక్ ర్యాలీ నిర్వహించారు. వైస్సార్సీపీ యూత్ నగర మాజీ అధ్యక్షుడు విల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో దాదాపు నూటఏభై మంది యువ కార్యకర్తలు ఉత్సాహంగా ఈ ర్యాలీ లో పాల్గొని ప్రజలకు ట్రాఫిక్ అంతరాయంలేకుండా క్రమబద్దీ కరించారు.ఈ సందర్భంగా విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ పేదరికం చదువుకు ఆటంకం కాకూడదనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విద్యారంగంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని అన్నారు.పేద విద్యార్థులకు దాదాపు 650 కోట్ల రాపాయలతో విద్యాకానుక కిట్లను అందచేయడం శుభపరిణామన్నారు.ఈ ర్యాలీ లో వైస్సార్సీపీ అధికారప్రతినిది కొండా రాజీవ్ గాంధీ,రూప,నిమ్మశ్రీను,బుజ్జి తదితరులు పాల్గొనే కార్యకర్తలను ఉత్సాహపరిచారు.

# రైతులకు కణితి రోడ్డు మార్కెట్ లోనే అమ్మకాలకు అనుమతినివ్వాలి



నిరసన తెలుపుతున్న రైతులు, వ్యాపారస్తులు

గాజువాక: రైతులకు గాజువాక కణితి రోడ్డు మార్కెట్ లోనే కూరగాయలు, ఆకుకూరలు అమ్ముకోవడానికి అముమతినివ్వాలని సీ.పీ.ఐ, గాజువాక మార్కెటింగ్ చిల్లర వర్తకుల సంఘం విజ్ఞప్తి చేసింది ఈ మేరకు సంఘం ప్రతినిదులు శనివారం సౌత్ ఏ.సీ.పీ ఆంజనేయ రెడ్డి కి వినతిపత్రం అందచేశారు. శనివారం ఉదయం కణితి రోడ్ మార్కెట్ వద్ద రైతులు, వర్తక సంఘ ప్రతినిధులు నిరసన ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం సంఘం ప్రతినిధులు సౌత్ ఏ.సీ.పీ ఆంజ నేయరెడ్డి ని కలిసి రైతుల సమస్య లను వివరించి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీ.పీ.ఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ మాట్లా డుతూ కోవిడ్ - 19 కారణంగా వ్యాపారస్తులకు తాత్కాలికంగా ఆదర్శ గ్రౌండ్ లో వ్యాపారాలకు అనుమతి నిచ్చారని, అక్టోబర్ 1 న తాత్కాలిక వ్యాపారా లను ఆదర్శ గ్రౌండ్ నుండి ఎత్తివేయడంతో రైతులు తీవ్ర ఇక్కట్లకు గురటఅ తున్నా రన్నారు. రైతు లకు కణితి రోడ్ లోనే వ్యాపా రాలకు ఎంతో అనుకూలంగా ఉంటుందని, అధికారులు తక్షణమే స్పందించి గాజువాక కణితి రోడ్ లోనే రైతులకు అమ్మకాలు సాగించేందుకు అవకాశ మివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీ.పీ.ఐ నాయకులు అప్పారి విష్ణు మూర్తి, వర్తక సంఘం అధ్యక్షులు ఎం.రామారావు, ఉపాధ్యక్షులు కర్రి వెంకటేశ్వర రావు, కార్యదర్శి సలీం, జాయింట్ సెక్రటరీ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 12 నుండి 15 వరకు ఐటిఐ కౌన్సిలింగ్





కంచరపాలెం : విశాఖ జిల్లా లో గల ప్రభుత్వ మరియు ప్రయివేట్ ఐటిఐ లలో 2020 ఆగస్ట్ విద్య సంవత్సరంలో ర్యాన్క్ ల ఆధారంగా ఈనెల 12 నుండి 15 వరకు కంచరపాలెం ప్రభుత్వ ఐటిఐ లో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఐటిఐ ప్రిన్స్ పల్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేసారు . ఈ మేరకు 12 వ తేది ఉదయం 8 గంటల నుండి మద్యాహ్నం 1 గంట వరకు 1 వ ర్యాన్క్ నుంచి 325 ర్యాన్క్ వరకు ఆదే రోజు 326 నుంచి 650 వరకు , అలాగే 13 వ తేది ఉదయం 8 గంటల నుండి మద్యాహ్నం 1 గంట వరకు 651 ర్యాన్క్ నుంచి 975 వరకు ఆదే రోజు 976 నుంచి 1300 ర్యాన్క్ వరకు అదే విదంగా 14 వ తేది ఉదయం 8 గంటల నుండి మద్యాహ్నం 1 గంట వరకు 1301 నుంచి 1625 వరకు అదే రోజు 1626 నుంచి 1950 వరకు ఆలాగే 15 వ తేది ఉదయం 8 గంటల నుండి మద్యాహ్నం 1 గంట వరకు 1951 నుంచి 2276 ర్యాన్క్ సాదించిన అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించటం జరుగుతుందన్నారు. కౌన్సిలింగ్ నకు హజరైన అభ్యర్థులు అన్ని ఒరిజనల్ దృవ పత్రాలతో కౌన్సిలింగ్ సమయానికి హాజరుకావాలని తెలియజేశారు.

## వైఎస్ఆర్ ఆసరాతో

# జగనన్నకు మహిళలు జేజేలు

### వైసీపీ నాయకులు లాలం పైడికొండ



అచ్యుతాపురం : వైఎస్ఆర్ ఆసరాతో జగనన్నకు మహిళలు జేజేలు పలుకుతున్నారని భోగాపురం వైసీపీ గ్రామపార్టీ అధ్యక్షులు లాలం పైడికొండ అన్నారు. శనివారం భోగాపురం గ్రామంలో డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా మంజూరైన నగదును ఆయన చేతులు మీదుగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వైఎస్ఆర్ ఆసరా పథకంను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు తదితరుల పాల్గొన్నారు.

## బండారు రంగమోహన్ 6వ వర్ధంతి సందర్భంగా

# బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు



విశాఖపట్నం : శనివారం ఉదయం లాసన్స్ బే కాలనీ లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, స్వర్గీయ బండారు రంగమోహన్ 6 వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ విచ్చేశారు. ఈ సందర్భంగా పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ రంగమోహన్ క్రమశిక్షణ గల కార్యకర్త అని, పార్టీ కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తి అని, చిన్నతనం నుండి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లో చురుగ్గా ఉంటూ అనేక సేవ కార్యక్రమాలలో పాలు పంచుకున్నారు. పార్టీకి సేవ చేసిన వ్యక్తులను నాయ కులుగా తీర్చిదిద్దడంలో సిద్ధహస్తులు అని చిన్నవయసు లోనే అకాలమరణం పాలవడం అతని కుటుంబాన్ని మరియు పార్టీకి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రకాష్ రెడ్డి, విజయానంద రెడ్డి, జగపతి రాజా బహదూర్, వేదుల దక్షిణామూర్తి, పొలిమేర శ్రీనివాస్, వల్లూరి మోహన్‌రావు, నగర ఉపాధ్యక్షులు దుర్గరాజుతదితరులు పాల్గొన్నారు.

# జగనన్న విద్య కానుక కిట్లు పంపిణీ



గాజువాక: జివియంసి 72వ వార్డ్ పరిధి చినగంట్యాడ పాఠశాల లో వార్డ్ వైకాపా కార్పొరేటర్ అభ్యర్థి సిరట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గాజువాక నియోజకవర్గ ఇన్చార్జ్ తిప్పల దేవన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ జగనన్న విద్య కానుక విద్యార్థులకు ఒక వరం అని అన్నారు. విద్యార్థులు ఈ కానుకను సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు స్కూల్ హెడ్ సైలజ, టీచర్స్, వాసవి నాయుడు, పైడిరాజు, వెంకటేశ్వరాజు, గోవిందరావు, కేశవరావు, నిర్మల, వెంకట్, సాంబమూర్త, అప్పల రాజు, సురేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వైయస్సార్ ఆసరా ద్వారా పొదుపు ఖాతాల్లోకి 14 కోట్ల 55 లక్షలు జమ

**- మండలంలో 1932 గ్రూపులకు లబ్ది**

**- సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు**

**- వెలుగు ఏపీవో ఆదినారాయణ**

చోడవరం : మండలంలోని వైయస్సార్ ఆసరా పథకం ద్వారా మొదటి విడతగా 14 కోట్ల 55 లక్షల రూపాయలు డ్వాక్రా సంఘాల బ్యాంకు పొదుపు ఖాతాలో జమ అయినట్లు చోడవరం వెలుగు ఏ పీ ఓ ఆదినారాయణ శనివారం తెలిపారు. ఈ పథకం ద్వారా మండలంలో 1932 డ్వాక్రా సంఘాల మహిళలు లబ్ది పొందారన్నారు. ఇప్పటికే ఆసరా సొమ్ము బ్యాంకుల ద్వారా చెల్లించడం జరుగుతుందని, నగదు తీసుకునే సమయంలో వివోఏ లు, ఇతర సిబ్బంది ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.



చోడవరం వెలుగు ఏపీవో ఆదినారాయణ

## రక్తదాన శిబిరంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బాబ్జి

పరవాడ: పెందుర్తి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు గండి బాబ్జీ విశాఖపట్నం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. అనంతరము అయన మాట్లడుతూ అన్నిదానాలు కన్న రక్తదానం గొప్పదనీ అన్నారు.రక్తదానం చేయిడములో వలన ఎందురో ప్రాణాలును కాపాడుగలమనీ అయన అన్నారు.ఈకార్యక్రమంలో పెందుర్తినియోజకవర్గ టిడిపి ఇంచార్జి బండారు అప్పలనాయుడు అధిక సంఖ్యలో కార్యకర్తలు రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### భావి మార్గం భారతీయం

ద్వితీయ సహస్రాబ్ది ముగింపు దశలోని చరిత్ర మూల మలుపులో, 1999 జూలై 4న అమెరికాలోని సిన్సినాటీలో తెలుగువారిని ఉద్దేశించి పీవీ నరసింహారావు ఇచ్చిన ప్రసంగం అలనాడు 1893లో షికాగోలో జరిగిన సర్వమత సమ్మేళనంలో స్వామి వివేకానంద ప్రసంగాన్ని గుర్తుకు తెస్తుంది. వివేకానందుడు నాటి ప్రపంచానికి అవసరమైన మత సామరస్యాన్ని హిందూ ధర్మం ప్రాతిపదికగా బోధిస్తే, పీవీ నరసింహారావు నేడు సాంకేతికాభివృద్ధి పేర ప్రపంచం ఎదుర్కొంటున్న వైపరీత్యాన్ని వివరిస్తూ అందుకు పరిష్కారం భారతీయ చింతనలో ఉన్నదని బోధించారు. అత్యాశతో గుడినీ గుడిలో లింగాన్నీ మింగజూసే సర్వభక్షక సాంకేతికతలను భూమాత ఇంకెంతకాలం భరిస్తుంది? అని ప్రశ్నించారు. వేలాది ఏండ్లుగా ప్రకృతితో సన్నిహితంగా ఉంటూ ఉభయతారకంగా సాగిన సహజీవన విధానాన్ని మానవాళికందించి విశ్వమంతటినీ ఉద్ధరించే బాధ్యతను అమెరికాలోని భారతీయులు స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పాశ్చాత్య నాగరికతల ఘర్షణ సిద్ధాంతాన్ని తప్పు పడుతూ అందుకు ప్రతిగా ఉత్తమ మానవ వికాసాన్ని సూచిస్తూ అరవిందుల దర్శనాన్ని ప్రస్తావించారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘాధ్యక్షులకు, పదాధికారి మహాశయులకు, ఈ 12వ మహాసభకు యావత?ండం నలుమూలల నుంచి పరమోత్సాహంతో విచ్చేసిన సభిక సోదర సోదరీమణులకు అనేక నమస్సులు. ఏ దేశమైనా సరే, దాని సంస్కృతి ఎల్లకాలం ఒకే విధంగా స్తంభించి ఉండదు. ఇతర దేశాల సంస్కృతుల నుంచి పూర్తిగా నిర్లిప్తమై ఉండదు. భారతదేశానికి యూరపు ఖండానికీ మధ్య సాంస్కృతిక ఆదాన ప్రదానం శతాబ్దాలుగా జరుగుతున్నది. నేటికీ యూరపునకు చెందిన పండిత ప్రకాండులెందరో రామాయణ మహాభారతాల నిత్యనూతన సంస్కరణలు ప్రచురిస్తున్నారు. భారతీయ తత్తశాస్త్రాలపై పరిశోధిస్తున్నారు. భారతీయ సభ్యత మానవచరిత్రలో ఏ సభ్యతకూ తీసిపోదని సర్వసమ్మతంగా స్వీకరించడం జరుగుతోంది. జ్ఞానవిజ్ఞాన క్షేత్రాల్లో భారతదేశం ఇతరులతో సమఉజ్జీగా ఉంది. వనరుల కొరతే కాని బుద్ధికుశలతలో కొరత మనకు లేదు. అరబిందో భవిష్యద్దర్శనంలో నేడు పరస్పర భిన్నంగా చిత్రించబడుతున్న భౌతిక, ఆధ్యాత్మిక క్షేత్రాల ప్రగతిని ఒకే ఒక సమన్విత ప్రక్రియగా చూడటమే కాక రెంటిలోనూ అంతిమ రూపంలో అభిన్నతను దర్శిస్తూ రెంటినీ ఒకే ఒక శాశ్వత సత్యానికి అంతస్స్వరూపాలుగా ప్రతిపాదించారు. ఇంత పెద్ద మార్పు వచ్చిన సందర్భంలో దీనికనుగుణంగా మానవుల్లో కూడా పెద్ద మార్పు రాకుండా ఉండదనడం స్పష్టం. అమెరికన్ తత్తవేత్తల్లోనే ప్రాచీనత పట్ల అపూర్వాసక్తి, తమలో ఏదో లోపించిందన్న భావం నాకు కనిపించింది. ఈ కలిమిలేముల మధ్య చక్కని సంతులనం సృష్టించే మహత్తర పాత్రను నిర్వహించే మహదవకాశం భారతీయ సముదాయంలోని ఉప సముదాయాలకు లభ్యమైందని నా విశ్వాసం. తెలుగు వారు కూడా దానిని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని నేను నమ్ముతున్నాను. లక్షలాది ఏండ్లుగా ప్రకృతి మాత కూడబెట్టిన నైసర్గిక సంపదనంతటినీ రెండు మూడు వందల ఏళ్ళలోనే 'ఖలాస్'చేసి ప్రపంచాన్ని సర్వనాశనానికి గురిచేసిన ఘనత స్వార్థపరులైన సామ్రాజ్యాలకూ వారి అడుగులకు మడుగులొత్తిన వైజ్ఞానికులకూ దక్కింది. అత్యాశతో గుడినీ గుడిలో లింగాన్నీ మింగజూసే సర్వభక్షక సాంకేతికతలను భూమాత ఇంకెంతకాలం భరిస్తుంది? వేలాది ఏండ్లుగా ప్రకృతితో సన్నిహితంగా ఉంటూ ఉభయతారకంగా సాగిన సహజీవనం మానవాళికందించి విశ్వమంతటినీ ఉద్ధరించే బాధ్యత మీరు స్వీకరించకపోతే మూన్నాళ్ళ ముచ్చటగా వచ్చి అంతర్ధానమయ్యే రాజకీయవాదులు ఎలా స్వీకరిస్తారు. భూమాతనుద్దేశించి 'తల్లీ! నీ మీద నా పాదం మోపి నీ పట్ల అపచారం చేస్తున్నందుకు నన్ను క్షమించు' అన్నాడు సంవేదనశీలుడైన భారతీయుడు. వీటి విలువను భారతీయ వైజ్ఞానికులు తప్ప మరెవ్వరు గుర్తిస్తారు?

# అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు

## పశు వైద్య చికిత్స భవనాన్ని ప్రారంభించిన పర్యాటక శాఖామంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విశాఖపట్నం : పద్మనాభం మండలం ,రెడ్డిపల్లి గ్రామంలో సుమారు 32 లక్షల వ్యయంతో నిర్మించిన పశు వైద్య శాల భవనాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. పశు వైద్య శాల లో సిబ్బందికి అవసరమైన కంప్యూటర్, ఫర్నిచర్ లాంటి మౌలిక వసతుల కల్పనకు సంబంధిత శాఖ మంత్రి తో మాట్లాడి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య శాఖ జాయింట్ డైరెక్టర్ రామకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ కరుణాకర్, వ్యవసాయ శాఖ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జయ శేఖర్, ఇతర అధికారులు హాజరయ్యారు.

అనంతరం మంత్రి రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల లో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు బలహీనవర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న దనీ అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని వీటిని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు.


ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ద్వారా ఉపయోగించుకోవాలన్నారు. మండలం లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి ముత్తం శెట్టి పద్మనాభం మండలం తుని వలస, చిన్నాపురం గ్రామాలలో సిసి రోడ్లు , డ్రైనేజ్ నిర్మాణాలకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపనలు గావించారు.

చిన్నాపురం గ్రామ జంక్షన్లో సుమారు 10 లక్షల వ్యయంతో చేపట్టే బస్ షెల్టర్ నిర్మాణానికి శంఖు స్థాపన చేశారు. అదేవిధంగా చిన్నాపురం గ్రామసచివాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో పద్మనాభం మండల తాసిల్దార్ శ్రీనివాసరావు ,ఎంపీడీవో చిట్టి రాజు, ఇతర అధికారులు హాజరయ్యారు.



# పావురాలు కొండ పైన ఉన్న బౌద్ధ స్తూపాలు ప్రాంతను అభివృద్ధి చేయాలి : జయశ్రీ



భీమునిపట్నం : హెరిటేజ్ మీరేటర్ జయశ్రీ హటం గడి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం యువతీ యువకులు నరసింహ స్వామ్య గిరి కొండ పైకి ట్రెక్కింగ్ చేస్తూ పావురాలు కొండ పై ఉన్న బౌద్ధ స్తుపాలను సందర్శించారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ కొండ పైన ఉన్న బౌద్ధ స్తుపాలు ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## కవి సమయం

### ఊహల-పల్లకి

కల-కల-కల
కిల-కిల-కిల
కోకిలమ్మ కుహ; కుహ;లు చేశావె!
గల -గల -గల
గిల-గిల-గిల
గోదావరి నడకల్లా!
వోయిలు -వొలక బోసావె!
చల - చల- చల
చిల-చిల-చిల
వాన చినుకుల్లా!
వాలావే - నా ఒంటిపైనా!
...॥కల॥
జల-జల-జల
జిల-జిల-జిల
అంతర జాలం చూపించవే ఇకనైనా!
వేయనా!... తీయనా!
తియ్యినా!... వేయనా!
జమ చెయ్యినా!
నా ఆర్థిక లావాదేవీలు
నీ కుహ:రంలో
తేలనా!... ములగనా!
ములగనా!.. తేలనా!
తేలి - తేలి- ములగనా!
నీ నది నీటి మడుగులో
డల - డల - డల
డిల- డిల- డిల
డమరుకం మ్రోగించనా
నీ మదిలోనా! ...॥కల॥
బల - బల-బల
బిల-బిల-బిల
తిరిగానే - తిరిగానే నీ చుట్టూ బొంగరంలా!
ఓనాడు
పల - పల-పల
పిల- పిల- పిలా
నీ ఊహల- పల్లకిలో ఊగనా!
పిల్లన గ్రోవి మోగించనా! ఈనాడు ఇకపైనా! ...॥కల॥

...కవితా రచన
యల్:సిద్ధు

## పంచాంగం

మాసం : అధిక ఆశ్వయుజ; తిథి: నవమి ప.12.05; పుష్యమి రా.8.59; ఉ.శే.వ.6.30వ

ఆదివారం 11-10-2020

**మేషం** : భాగ స్వామికుల మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. ప్రముఖుల కలయిక వల్ల ఏమంత ప్రయోజనం ఉండదు. **వృషభం** :రావల సిన ధనం సకాలంలో అందుట వలన పొదుపు దిశగా మీ ఆలోచన లుంటాయి. వాతావరణంలో మార్పు వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. వృత్తి వ్యాపారులకు శ్రమాధిక్యత మినహా ఆశించినంత పురోభివృద్ధి ఉండదు. **మిధునం** : కోర్టు వ్యవహారాలు, స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి అందుకు తగిన ప్రోత్సాహం లభిస్తాయి. బంధుమిత్రుల రాకపోకలు కుటుంబీకులతో ఉల్లాసంగా గడుస్తుంది. **కర్కాటకం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల పట్ల ఓర్పు, నేర్పు వ్యవహరించ వలసివస్తుంది. స్త్రీలకు వాహనం నడుపుతున్నప్పుడు ఏకాగ్రత అవసరం. సోదరీ సోదరుల మధ్య అవగాహన కుదురుతుంది. బంధువుల కోసం ధనం విరివిగా వ్యయం చేయవలసివస్తుంది. యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు. **సింహం** : బంధువుల నుంచి ఒత్తిడి, మొహమాటాలు ఎదుర్కొంటారు. ఎదుటి వారిని అతిగా విశ్వసించటం మంచిది కాదని గమనించండి.. **కన్య** : నిరుద్యోగులకు ఇంటర్వ్యూల్లో ఏకాగ్రత ముఖ్యం. ముఖ్యమైన వ్యవహారాల్లో ఎదుటివారిని సలహా అడగడం మంచిదని గమనించండి. మీ జీవిత భాగస్వామి సలహా పాటించి లబ్ధి పొందుతారు. **తుల** : మీ సామర్థ్యానికి ఆశించినంత ప్రతిఫలం లభిస్తుంది. స్త్రీలు దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. **వృశ్చికం** : స్త్రీలు విలువైన వస్తువులు చేజార్చుకునే ఆస్కారం ఉంది. ఇళ్ల స్థలాలు, పొలాల అమ్మకంలో పునరాలోచన మంచిది. ఏజెంట్లకు, బ్రోకర్లకు శ్రమాధిక్యత మినహా ఆర్థిక సంతృప్తిఉండదు. **ధనుస్సు** : పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతారు. బంధు మిత్రులతో సఖ్యత నెలకొంటుంది. సోదరీ, సోదరులతో ఏకీభవించలేకపోతారు. **మకరం** :రాజకీయ నాయకులు సభలు, సమావేశాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. మీ సంతానం విద్య, ఆరోగ్య విషయాల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. వృత్తి, వ్యాపార రంగాల వారికి సదవ కాశాలు లభిస్తాయి. **కుంభం** : ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి అధికారులను మెప్పిస్తారు. వాతా ఎమవరణంలో మార్పు రైతులకు ఆందోళన కలిగిస్తుంది. వ్యవసాయ, తోటల రంగాల వారికి వాతావరణం అనుకూలిస్తుంది. **మీనం** :వ్యాపారాభివృద్ధికి అహర్నిలు శ్రమిస్తారు. ఖర్చులు, చెల్లింపులలో ఏకాగ్రత వహించండి. అర్థాంతరంగా నిలిపి వేసిన పునఃప్రారంభమవుతాయి. ప్రముఖుల సహకారంతో మీ సమస్య పరిష్కారమవుతాయి.

# శుభ ఫలితాలనిచ్చే సుబ్రమణ్యస్వామి

## సంకీర్తన

ఒకే శరీరంలో ఆరుముఖాలు పన్నెండు చేతులు గల కార్తికేయునికి సహాయకులుగా పార్వతిదేవి నూపురం నుంచి తొమ్మిది మంది వీరులు జనించారు. వీరబాహు, వీరకేసరి, వీర మహేంద్ర, వీర మహేశ్వర, వీర పురంధర, వీర రాక్షస, వీర మార్తాండ, వీరాంతక, వీర ధీర అని వారిని పిల్వడం జరుగుతోంది. విష్ణు ఆదేశం మేరకు శివుడు ఆ బాలుని నుంచి ప్రణవోపదేశం పొందాడు. ఆ కారణంగా సుబ్రహ్మణ్యేశ్వరుడికి, శివగురు, స్వామినాథ, దేశిక అనే పేర్లు వచ్చాయి. కుమారస్వామి ఇంద్రుని కుమార్తె అయిన దేవయానిని, శివమూర్తి కుమార్తె వల్లీదేవిని వివాహమాడాడు. అలాగే ఆ స్వామి నెమలిని తన వాహనంగానూ, కోడి పుంజును తన ధ్వజంగానూ చేసుకున్నాడు. ఆ కారణంగా స్వామి శిఖివాహనుడు, కుక్కుట ధ్వజుడయ్యాడు. సుబ్రమహ్మణ్యేశ్వరుడి ధ్వజమందు కోడి పుంజు ఉంటుంది. కో అనే ధ్వని ప్రణవమును సూచిస్తుంది. జ్ఞాన భానూదయము నకు ధ్వని సంకేతం. అలాగే స్వామి వాహనమైన నెమలి పురివిప్పి నర్తించునపుడు ఓంకార రూపంలో ఉంటుంది. ఆ కారణంగా స్వామిని ప్రణవ స్వరూపుడిగా చెబుతారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సేవించే సమయంలో ఉరగేశ్వ రాయనమః మహోరణాయనమః అని కీర్తించడం జరుగుతోంది. వల్లీదేవి స్వరూపంలో ఉన్నదని, స్వామి కూడా సర్ప రూపంలో ఉంటాడని పురాణాల ద్వారా అవగతమవుతోంది.తెలుగు రాష్ట్రాలలో సుబ్రహ్మణ్య షష్టి పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు ఈ పర్వదినం రోజున స్వామికి ఘనంగా పూజలు నిర్వహిస్తారు. సుబ్రహ్మణ్య షష్టిరోజున వేకువ జామునే నిద్రలేచి తలంటు స్నానం చేస్తారు. అనంతరం సుబ్ర హ్మణ్యేశ్వరునికి సమర్పిం చడానికి చిలీ (నువ్వులు, బెల్లంతో కలగ లిపినది) తయా రుచేసి, కొబ్బరి కాయలు, అరటి పళ్ళు, పాలు, కోడిగుడ్లతో బయలు దేరుతారు. సుబ్ర హ్మణ్యేశ్వరుడు సర్పా కారుడు కావ డంవల్ల సమీప ప్రాంతాలలో ఉన్న పుట్టలకు చేరుకుని పుట్టను శుద్ధిచేసి, పసుపు, కుంకుమ బొట్లు, అందమైన ముగ్గు లతో అలం కరిస్తారు. అనంతరం, పాలు కోడి



గుడ్లను పుట్టలలోవేసి, ప్రసాదాలను, కొబ్బరి కాయలను నివేదిస్తారు. స్వామిని భక్తితో పూజిస్తూ, భజన గీతాలు, భక్తి పాటలతో కీర్తిస్తారు. అనంతరం పుట్ట మన్నును తమ చెవులకు రాసుకుంటారు. అలా చేయడంవల్ల తమకు చెవికి సంబంధించిన వ్యాధులు దరిచేరవని నమ్ముతారు. అలాగే మహిళా భక్తులు, పుట్టలో పాలుపోసి, పుట్ట చుట్టూ భక్తి శ్రద్ధలతో ప్రదక్షిణలు చేస్తారు. సంతాన ప్రాప్తికోసం స్వామిని మనసావాచా ఆరాధిస్తారు. పిల్లలు, స్వామికి ప్రణామాలు అర్పించి మందుగుండు సామాను కాలుస్తారు.

అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే సుబ్రహ్మణ్య ఆరాధన శక్తిని, ఐశ్వర్య మహాద్భా గ్యాలను కల్గిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఆ సుబ్రహ్మణ్యే శ్వరుని అపార కృపా రసామృతం అందరిమీదా వెల్లి విరి యాలని మనసావాచా అందరూ పూజిస్తారు. పార్వతీ పరమేశ్వరుల ప్రేమకు, అనుగ్రహానికి ఐక్యరూపం సుబ్రహ్మణ్య స్వామి. స్వామి అనే నాయ ధేయం కేవలం సుబ్రహ్మణ్యానికి సొంతం. దేవ సేనాధిపతిగా, సకల దేవగణాల చేత పూజ లందుకునే దైవం కుమారస్వామి అని పురాణాలు చెబు తున్నాయి. అలాంటి షణ్ముఖుని అనుగ్రహం పొందగలిగితే స్కంద పంచమి, కుమార షష్టి రోజున స్వామని పూజించాలి. కుమారస్వామని పూజిస్తే గౌరీశంకరుల కటాక్షం మనకు లభించినట్టేనని పురాణాలు చెబు తున్నాయి. శివపార్వతుల తనయుడైన కుమారస్వామి గంగాదేవి గర్భంలో పెరిగాడు. ఆమె భరించ లేకపోవడంతో, ఆ శిశువు రెల్లుపొదల్లో జారిపడింది. ఆ శిశువును కృత్తికా దేవతలు ఆరుగురు స్తన్యమిచ్చి పెంచారు.

జారిపడినందున ఆ శిశువునకు స్కందుడని, రెల్లుగడ్డిలో ఆవిర్భవించడంతో శరవణుడని, కృత్తికా దేవతలు పెంచడంతో కార్తికేయుడని కుమారస్వామి అని పిలు స్తారు. ఇక సుబ్రహ్మణ్యునికి ఉన్న ఆరుముఖాలకు ప్రత్యేకతలు ఉన్నాయి. మయూర వాహనాన్ని అధిరోహించి కేళీ విలాసాన్ని ప్రదర్శించే ముఖం, పరమేశ్వరునితో జ్ఞానచర్చలు జరిపి ముఖం, శూరుడనే రాక్షసుని వదించిన స్వరూపానికి ఉన్న ముఖం, శరణు కోరిన వారిని సంరక్షించే ముఖం, శూలాయుధ పాణియై వీరుడిగా ప్రస్ఫుటమయ్యే ముఖం, లౌకిక సంపదల్ని అందించే ముఖం ఇలా ఆరు ముఖాల స్వామిగా ఆనందదాయ కుడిగా స్వామి కరుణామయుడిగా భక్తులచే నీరాజనాలు అందు కుంటున్నాడు. స్కంద పంచమి, షష్టి రోజుల్లో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే సకల సంపదలు, సుఖవంతమైన జీవితం చేకూరుతుందని పురో హితులు చెబుతున్నారు.

# ఏపీఐఐసి పెండింగ్ ప్యాకేజీలు ఇప్పించాలి



అచ్యుతాపురం : పూడిమడక మత్స్యకారులకు ఏపీఐఐసి పెండింగ్ ప్యాకేజీలు ఇప్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము అన్నారు. శనివారం మత్స్యకారుల ప్యాకేజీలు సమస్యలపై సిఐ టియు ఆధ్వర్యంలో ఇంకా ప్యాకేజీలు రానివారితో కలిసి తహసీల్దారు నారాయణ రావుకు వినతిపత్రం అంద జేశారు. పూడిమడకలో ఇంకా 400 మందికి ప్యాకేజీ ఇవ్వా లన్నారు. అధికారులు చుట్టు తిరుగు తున్న పట్టించు కొవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన అది ,కారులు స్పందించి వెంటనే ప్యాకేజీ ఇప్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు, చేపల తాతయ్య, మత్స్యకారులు పాల్గొన్నారు.

## గంటా నూకరాజు ఆధ్వర్యంలో

# టీడీపీ నాయకుల సమావేశం

భీమునిపట్నం : టీడీపీ నియోజకవర్గ కోర్ కమిటీ సభ్యులు, భీమిలి డివిజన్ అధ్యక్షుడు గంటా నూకరాజు ఆధ్వర్యంలో భీమిలి జోన్ 3వ వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఏ అభివృద్ధి చేయలేదని, నవరత్నాలు పేరిటా వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ స్టిక్కర్లు అంటించుకొని పార్టీ ప్రచార కార్యక్రమం మొదలు పెట్టారని గంటా నూకరాజు అన్నారు. జగనన్న విద్యాపథకం కోసం పిల్లలకు కిట్లు ఇచ్చినంతవరకు బాగానే ఉన్నా.పిల్లలు బెల్టులు, బేగ్ లు కూడా పార్టీ జెండాలతో ఇవ్వడం హేయమైన చర్య అని అన్నారు. నవరత్నాలు ద్వారా పార్టీ ప్రచారం చేయడం తప్ప ఈ 16 నెలల కాలంలో ఒక్క అభివృద్ధి చేయలేదని అన్నారు. విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే నిరుద్యోగ భృతి, పేదవాడికి మూడు పూటలా కడుపునింపే అన్న క్యాంటీన్ లు లాంటి వాటికి అడ్రస్ గల్లంతు చేశారని, ఉన్నపరిశ్రమలు పోవడంతో పాటు రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాకుండా చేసి సంపద ఎలా రాబట్టాలని చూస్తున్నారని అన్నారు.చంద్రన్న బీమా ద్వారా రేషన్ కార్డులో 18 నుండి 60 సంవత్సరాలు వయసు వారు ఎంతమంది ఉంటే వారందరికి వర్తించెదని, కానీ నేటి ప్రభుత్వం కార్డులో ఒక్కరికి మాత్రమే అని నిబంధన పెట్టారని, ప్రజల జీవనానికి ముడిపడి ఉండే పథకాలు అన్ని రద్దుచేసి, కొత్తపథకాలు ఇస్తున్నట్లు చెప్పుకుంటున్నారని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సామాన్యుడు బ్రతకడమే కష్టమైందని, భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి మరీ దయనీయంగా ఉందని గంటా నూకరాజు అన్నారు. మాజీ కౌన్సిలర్ చురకల రమణ మాట్లాడుతూ.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ కరువయిందని, అని అన్నారు. సీనియర్ నాయకులు మారోజు సత్యవరప్రసాద్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు పెట్టినా తెలుగుదేశం ఢంకా మోగిస్తుందని, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు డొకర సన్యాసప్పుడు, కాసరపు నాగ రాజు, పెంటపల్లి యోగీశ్వరరావు, మారోజు సంజీవకుమార్, కొక్కిరి అప్పన్న, రాజగిరి రమణ, అప్పీ కొండ నూకరాజు, దాసరి వెంకటేష్, వియ్యపు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేయడం ద్వారా

# ఉత్పాదకత పెంచడంపై దుడ్డుపాలెంలో అవగాహన కార్యక్రమం




సాగునీటిని సద్వినియోగం పై రైతులకు వివరిస్తున్న స్థానిక నాయకులు కూర్మదాసు మాలిబాబు

చోడవరం : మండలంలోని దుడ్డు పాలెం గ్రామంలో కోమటి చెరువు అభివృద్ధి చేయడం ద్వారా ఉత్పాదకతను పెంచడంపై శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ బ్యాంకు నిధులతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ పరివర్తన పథకం ద్వారా సాగునీరు వనరులు పెంచుకోవడం పై సాధన సంస్థ ఏపీ ఐ ఐ ఏటి ప్రాజెక్ట్ టీం లీడర్ దాలినాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్పాదకత పెంచడం, లాభదాయక వ్యవసాయం, రైతు సంఘాల ఏర్పాటు, దళారీ వ్యవస్థ నిర్మూలన, సంఘాలు బలోపేతం తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్ పి పుల్లారావు తదితరులు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు కూర్మ దాసు మాలి బాబు, గొంప అప్పలస్వామి, గ్రామ కార్యదర్శి వెంకట్, గణపతి, సచివాలయ సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.


## పాడి రైతుకు భీమా సొమ్ము పంపిణీ



గొలుగొండ : విశాఖ డెయిరీ రైతులకు పాడి పశువుల బీమా సొమ్మును శనివారం పంపిణీ చేశారు. బిసిసి పరిధిలో గల శ్రీరాం పురం ఎంఆర్ఐకి సంబంధించి కిల్లాడ అప్పలనాయుడు పశు బీమా సొమ్ము రూ.40వేలను బోర్డు డైరెక్టర్ చిటికెల రాజకుమారి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల సొసైటీ అధ్యక్షులు, గొలుగొండ సూపర్వైజర్, సొసైటీ కార్యదర్శి పాల్గొన్నారు.

## ఘనంగా నేషనల్ ఫారం ఓబిసి యూత్ వింగ్

# విశాఖ అధ్యక్షులు జాగరపు శ్రీనుకి సత్కారం



గాజువాక : నేషనల్ ఫారం జాతీయ అధ్యక్షులు ఆంధ్ర ప్రదేశ్ పర్యటన లో భాగంగా గాజువాక నియోజకవర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు నెల్లి గురుదేవ్ జి, అల్ ఇండియా ప్రజావెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు గూడూరు వెంకటేశ్వరరావు చేతుల మీదుగా జాగరపు శ్రీనును ఘనంగా సత్కరించారు.

శాలువా కప్పి, పుష్పగుచ్ఛనిచ్చి, పూల మాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కి చెందిన పేద ప్రజల పక్షాన అన్ని విధాలుగా పోరాటాలు చేస్తూ పేద ప్రజల కోసం ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తు,ప్రజలు హృదయాలలో ఉన్నత స్థానాన్ని సంపాదించాడని విశాఖ జిల్లా ఓ బిసి ఫారం నేషనల్ అధ్యక్షులు జాగరపు శ్రీను అభినందించారు. మరిన్ని సేవాలందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్.ఎఫ్.ఎస్.జె అధ్యక్షులు ఎన్.ఎస్. కుమార్,ఎన్.ఎఫ్.ఎస్.జె విశాఖ పచ్చిమ కన్వీనర్ కొల్లి నూకరెడ్డి, జాతీయ బీసీ సంఘం నాయకులు, అల్ ఇండియా ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్, విశాఖ జిల్లా బీసీ నాయకులు గొడ్డి కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన జయవీర్



అనకాపల్లి : పట్టులోని గవరపాలెం సంతకం పట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయ చైర్మన్ దాడి జైవీర్ గోడ పత్రికను ఆవిష్కరించారు . ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కరోణ సందర్భంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

పోలీస్ శాఖ సూచనల ప్రకారం ఉత్సవాలు జరిపి ఇస్తామన్నారు.సెప్టెంబర్ నెలాఖరు వరకు కరోణ వ్యాధి ఎక్కువగా ఉన్నప్పటికీ అక్టోబర్లో నెలలో దేవీ నవరాత్రి సందర్భంగా అమ్మవారి దయ వల్ల ఈ నెలలో కరోణ కేసులు తగ్గాయని. దసరా అనంతరం కరోణ పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ప్రతి ఏడాది వల్లే ఈ ఏడాది కూడా కొత్త తరహాలో జాతర నిర్వహించబడుతుంది. ఈ ఏడాది కూడా జాతర ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందని అమ్మవారి దయ ఉంటే అన్ని కార్యక్రమాలు జరిగిపోతాయని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలోఆలయ వ్యవస్థాపకులు పివి రమణ. ఆలయ నిర్వాహకులు. కాండ్రేగుల నాయుడు. కొణతాల మురళీకృష్ణ. కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు దాడి కృష్ణ. మల్ల జగ్గ అప్పారావు. సూరిశెట్టి నర్సింగరావు. కొణతాల బాబురావు. పొలిమేర శ్రీను. ఓం ప్రకాష్. మద్దాల శంకర్రావు.. కే యం నాయుడు. బుద్ధ సంతోష్. తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికే 'చేయూత'




అనకాపల్లి : మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకే వైఎస్ఆర్ చేయూత పథకం ఎంతగానో ఉపయోగ పడు తుందని, ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శనివారం మండలంలో బిఆర్టీ కోలనీలో వైఎస్ఆర్ చేయూత ద్వారా ఏర్పాటు చేసిన కిరాణా దుఖానాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో మండల అద్యక్షులు గొర్లి సూరిబాబు, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మండల కార్యదర్సి భీశెట్టి జగన్, పట్టణ అద్యక్షులు మందపాటి జానకి రామ రాజు, గ్రామ పెద్దలు మొల్లేటి శివాజీ, దాడి రామకోటి, బుద్ధ నాగేశ్వరరావు, బుద్ధ సత్యనారాయణ, గ్రామ వాలంటీరలు, గ్రామ మహిళా సంఘాలు పాల్గొన్నారు.

# జిల్లాలో భారీగా నాటుసారా ధ్వంసం







పెద్దాపురం : జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ కేసులలో శనివారం తూర్పుగోదావరి సీజ్ చేసిన నాటు సారాయిని ప్రొహిబిషన్.. ఎక్సైజ్ శాఖ డిప్యూటి కమీషనం వారి ఉత్తర్వుల ప్రకారం తూర్పు గోదావరి జిలా అద్నాన్ నయీమ్ అస్మి మరియు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎసీ డాక్టర్ సుమిత్ గరుడ్ సమక్షంలో క్వార్టర్స్ నందు శనివారం జిల్లాలో పెద్దాపురం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం పోలీస్ క్వార్టర్స్ నందు శనివారం జిల్లాలో పెద్దవు రామచంద్రాపురం, రంపచోడవరం, చింతూర్ సబ్ డివిజన్ పరిధిలో గల పోలీస్ స్టేషన్స్ మరియు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్, కేసులలో సీజ్ చేసిన నాటు సారాయిని ధ్వంసం చేసేందుకు గాను ఈ కార్యక్రమానికి విచ్చేసినారు. జిల్లా ఎస్పి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో 42 పోలీస్ స్టేషన్ల నుండి 10,822 లీటర్ల నాటుసారాను మరియు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ వారు సీజ్ చేసిన 877 కేసులలో 12654 లీటర్ల సారాయిని, మొత్తం 23,476 లీటర్ల నాటు సారాయిని, జిల్లా మొత్తం కలిపి 1687 కేసులల ధ్వంసం చేసే కార్యక్రమం చేస్తున్నట్లు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చే ప్రత్యేకంగా నియమింపబడిన స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ప్రత్యేక దాడులు చేస్తూ, నాటుసారా, అక్రమ మద్యాన్ని అరికడుతున్నామని తెలియజేశారు. అక్రమ తయారీదారులు, అమ్మకం దార్ల పై మూడుకేసులు కంటే ఎక్కువ కేసులు నమోదయితే వారిపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేసి వారి కదలికలపై నిఘా పెడుతున్నామని తెలియజేశారు. నాటు సారాయి విలువ సుమారు 58,69,000/- రూపాయాలు ఉంటుందని, ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి నాటు సారాయిని సేవించి ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ డాక్టర్ సుమిత్ గరుడ్ గారు మాట్లాడుతూ అక్రమ మద్యం, నాటుసారాయి లపై జిల్లాలో ఉక్కు పాదం మోపామని, అక్రమ ఇసుక రవాణా పై ఎటువంటి సమాచారం ఉన్నా తమకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం డి.ఎస్.పి. శ్రీ అరిటాకుల శ్రీనివాసరావు, పెద్దాపురం సి.ఐ. జయకుమార్, తుని రూరల్ సి.ఐ. కిషోర్, పెద్దాపురం ఎస్సై బాలాజీ, సామర్లకోట ఎస్సై సుమంత్, జగ్గంపేట ఎస్సై రామకృష్ణ, రంగంపేట ఎస్సై సుధాకర్ మరియు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఏపీ పాలిసెట్‌లో
# సుమన్ ట్యూటోరియల్స్ స్టేట్ ర్యాంకుల ప్రభంజనం

మురళీనగర్ : నగరంలోని మురళీనగర్‌లోగల ప్రముఖ విద్యాసంస్థ సుమన్ ట్యూటోరియల్స్ విద్యార్థులు ఏపీ పాలిసెట్ 2020లో స్టేట్ ర్యాంకుల ప్రభంజనాన్ని సృష్టించారు. శనివారం సంస్థ ప్రాంగణంలో జరిగిన కార్య క్రమంలో ఉత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులను సంస్థ ఫౌండర్ మరియు ఛైర్మన్ ఆర్.సుమన్ అభినందించారు. శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో వరుసగా పి.మేఘశ్యామ్819, ఎల్.దేవుడు నాయుడు 826, వి.పావని1106, కె.శ్రీనివాస్1374, కె.తేజస్‌నాయుడు2684 రాష్ట్రస్థాయి ర్యాంకులతోపాటు పలువురు ఉత్తమ ర్యాంకుల సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఈ కోచింగ్ సెంటర్ నుండి 20 మంది





విద్యార్థులు ఈ ప్రవేశపరీక్షకు హాజరు కాగా 18 మంది అర్హత సాధించారు. వీరిలో 14మంది విద్యార్థినీ,విద్యార్థులకు ప్రభుత్వ పాలి టెక్నిక్ కళాశాలల్లో సీట్లు లభించనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోగల వివిధ ఇంజనీరింగ్ డిప్లమో కోర్సులలో ప్రవేశం కోసం నిర్వహించిన పాలీసెట్ పరీక్షను 88వేల314మంది విద్యార్థులు రాశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించడం తమ సంస్థ లక్ష్యమని తెలిపారు. కరోనా సమయంలో కూడా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్యార్థులు ఆసక్తి కనబరచడంతో బాటు ఉపాధ్యాయులు ఎంతో శ్రమించి కోచింగ్ ఇవ్వడంతో ఈ ఫలితాలు సాధించామని, ఈ సందర్భంగా వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థడైరెక్టరు డి.బాబూరావు, ప్రిన్సిపాల్ పి.భార్గవ్, సీఈవో డి.ప్రసాద్ పాల్గొన్నారు.

# ఏపీ ఎంసెట్ ఫలితాల్లో '138'వ ర్యాంకు సాధించిన
## శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ విద్యార్థిని లహరి

పెద్దాపురం : పెద్దాపురం రామారావు పేటలో గల శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో చదువుతున్న 'జల్లూరి లహరి' ఈరోజు విడుదల అయిన ఏపీ ఎంసెట్ ఫలితాల్లో 138వ ర్యాంకు సాధించి, ఏ ఫలితాల్లో అయినా శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల ముందుంటుందని మరోసారి రుజువు చేసింది. ఇంత మంచి ర్యాంకు సాధించిన లహరిని అభినందిస్తూ శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల డైరెక్టర్ సి. హెచ్.విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలలో 'ఫలితాలే మాట్లాడతాయని' మరో సారి ఈ ఫలితాల ద్వారా ఋజువు అయిందని తెలియజేశారు. లహరి




ఇంతకు ముందు బిటిటి ఎస్ఏటిలో 450 మార్కులకు 357 సాధించిందని, ఐఐటి, జెఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 5045వ ర్యాంకు సాధించడం చాలా ఆనందదాయకంగా వుందని పేర్కొన్నారు. లహరి మాట్లాడుతూ తాను చిన్నప్పుడు నుంచే శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలోనే విద్యను అభ్యసిస్తున్నానని, ఇక్కడ ఉన్న ఉపాధ్యాయులు మరియు ఈ పాఠశాల వాతావరణం వల్లనే ఈ ర్యాంకులు సాధించడం సాధ్యమైనదని ఈ విజయం వెనుక తన తల్లిదండ్రులు, పాఠశాల డైరెక్టర్ సి.హెచ్.విజయ్‌ప్రకాష్, ప్రొ.ఎస్.ఆర్.సంతానం, రాయ్, ఉపాధ్యాయులు మరియు తన తోటి స్నేహితుల సహాయ సహకారాలు ఎంతో, వున్నాయని తెలియ జేసింది. ఇంత మంచి ర్యాంకు సాధించిన లహరిని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, తన స్నేహితులు కూడా అభినందించారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు పై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి
## - జుత్తాడ జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ


జుత్తాడ గ్రామంలో జగనన్న విద్యా కానుక అందజేస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు పై ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించాలని, దీనిలో భాగంగానే నాడు నేడు ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన తోపాటు, విద్యార్థులకు అవసరమైన సామాగ్రిని ప్రభుత్వం ద్వారా అందించడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని జుత్తాడ గ్రామంలో జగనన్న విద్యా కానుక సామాగ్రి పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా స్థానిక ప్రాథమిక పాఠశాలలో నాడు నేడు పనులను పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక సామాగ్రిని ఎమ్మెల్యే చేతులమీదుగా పంపిణీ చేశారు. అంతకుముందు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం డి ఓ దుర్గా శ్యాంసుందర్, ఎం ఈ ఓ అచ్యుతరావు, వైసిపి నాయకులు ఏడువాక సత్యారావు, శ్రీకాంత్, పల్లా నర్సింగ్ రావు, బొడ్డేడ సూర్యనారాయణ, సూరిశెట్టి నాగ దుర్గ గోవిందా, రాపేటి త్రినాథ్, మల్ల శ్రీనివాసరావు, అప్పి కొండ లింగబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గేదెల సన్యాసిరావు, ఇతర నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అవంతీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా
# ఘనంగా కర్రి సత్తిబాబు జన్మదిన వేడుకలు
## జన్మదినం సందర్భంగా పేద మహిళలకు చీరల పంపిణీ





సింహాచలం : వైసీపీ నాయకుడు సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు కర్రి సత్తిబాబు జన్మదిన వేడుకలు అశేష అభిమానుల నడుమ ఘనంగా నిర్వహించారు

జన్మదినం సందర్భంగా సింహాచలం రోడ్లకు ఇరువైపులా భారీ కట్టౌట్ లు ఏర్పాట్లు అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు జన్మదినం సందర్భంగా స్థానిక కళ్యాణమండపం లో ఏర్పాటు చేసిన వేడుకలకు భారీగా అభిమానులు హాజరుకాగా ఈ కార్యకరమానికి మంత్రి అవంతీ శ్రీనివాసరావు హజరుకగా 30 కేజీ లతో సిద్ధంచేసిన భారీ కేక్ ను కట్ చేయగా మంత్రి కేక్ ను తినిపించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు అనంతరం పేద మహిళలకు చీరలు మంత్రి చేతులు మీదుగా పంపిణీ చేశారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సత్తిబాబు కి శుభాకాంక్షలు తెలుపుతూ మంచి కుటుంబంలో పుట్టి మంచి మనసు విలువలు కలిగిన వ్యక్తి అని అతను అతని కుటుంబం శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారి ఆశీస్సులు తో సుక సంతోషాలతో జీవించాలని మున్ముందు ఎన్నో శిఖరాలు అధిరోహించాలని కోరారు

ఈ కార్యక్రమాన్ని వైసీపీ నాయకులు బెహెరా భాస్కర్ రావు కో ఆపరేటివ్ బ్యాంక్ ప్రెసిడెంట్ కర్రి స్వామి 98 వ వార్డు వైసీపీ నాయకులు కోలుసు ఈశ్వర్ రావు ఎర్ర వరం బాబు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అప్పన్న ను దర్శించుకున్న
# మంత్రి అవంతి శ్రీనివాసరావు



సింహాచలం : శ్రీ సింహాద్రి అప్పన్న ను శనివారం నాడు మంత్రి అవంతీ శ్రీనివాస రావు దర్శించుకున్నారు సింహగిరి కి చేరుకున్న మంత్రికి ఆలయ అధికారులు సాదర స్వాగతం పలుకగా స్వామి దర్శనం అనం తరం కప్ప స్థంబ ఆలింగనం అనంతరం లక్ష్మీ అమ్మవారి ను దర్శించు కున్నారు బేడా మండ పంలో వైదికులు వేద ఆశీర్వ చనం పలుకగా అధి కారులు మంత్రికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్య క్రమంలో ఆయన వెంట 98 వ వార్డు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## రాబోయే పండుగలను దృష్టిలో ఉంచుకుని
# ప్రచారంను ప్రారంభించిన ప్రధాని జాన్ ఆండోలన్



పరవాడ : జాన్ ఆండోలన్ ప్రచారం యొక్క ప్రధాన లక్ష్యం ఏమిటంటే, ప్రజలు ముసుగు ధరించాలి, సామాజిక దూరం మరియు హ్యాండ్ వాషిన్ నిర్వహించాలి. మరియు ప్రాంగణం, ఫ్యాక్టరీ మరియు కార్యాలయాల పరిశుభ్రత కూడా ఉంచాలి. ఈ ప్రచారంలో భాగంగా ఎన్‌టిపిసి సింహాద్రి జాన్ ఆందోలన్ ప్రచారం ప్రారంభించబడింది అని ఎన్టీపిసి పిఆర్వో మల్లయ్య తెలిపారు. అనంతరము కోవిడ్ 19 ప్రతిజ్ఞ చేశారు.

బ్యానర్‌ల ప్రదర్శన ద్వారా ప్రజల్లో అవగాహన కార్యక్రమంమరియు సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించామనీ పిఆర్వో మల్లయ్య తెలిపారు.

## విశాఖ చేరుకున్న
# పెట్రోలియంశాఖ కార్యదర్శి తరుణ్‌కపూర్



కంచరపాలెం : కేంద్ర సహజ వాయువులు మరియు పెట్రోలియం శాఖ కార్యదర్శి శనివారం రాత్రి విశాఖకు చేరుకున్నారు. ఈ మేరకు ఢిల్లీ నుండి ఎయిర్ ఇండియా ఎఐ 451 విమానంలో విశాఖ చేరుకున్న తరుణ్‌కపూర్. (కేంద్ర క్యాబినెట్ హెూదా)విమానాశ్రయం నుండి రోడ్డు మార్గాన నోవాటెల్ కి బయలుదేరి వెళ్ళారు. నగరంలో రెండు రోజుల పాటు ఆయిల్ రిఫైనరీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ, ఆయిల్ రిఫైనరీ మోడిఫికేషన్ సైట్ ప్రాజెక్ట్, పైప్ లైన్ టెర్మినల్, మరియు ఇతర విభాగాలు సందర్శించనున్నారు.

# థియేటర్ల కార్మికులకు నిత్యవసరాలు పంపిణీ




అనకాపల్లి : పట్టణం సినిమా థియేటర్లలో పనిచేస్తున్న కార్మికులకు నిత్యవసర సరుకులు పంపిణీ జరిగింది. శనివారం అనకాపల్లి శాసన సభ్యులు గుడివాడ అమర్‌నాథ్ రింగ్‌రోడ్‌లో పార్టీ కార్యాలయంలో వీటిని పంపిణీ చేసారు. సాదన స్వచ్ఛంద సంస్థ ఆద్వర్యంలో వీటిని కార్మికులకు అంథజేయడం జరిగింది. ఈసందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న కరోనా మహమ్మారీ వలన సినిమా థియేటర్లు మూతపడ్డాయని చెప్పారు. అందులో పనిచేస్తున్న సిబ్బంది పడుతున్న కష్టాలను గుర్తించి, సాదన సంస్థ ఈ కార్యక్రమం చేపట్టడం ,అభినందనీయమన్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందుగు వచ్చిఇటువంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టి పేదలను ఆదుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామ రాజు, మళ్ళ బుల్లి బాబు, గొర్లి సూరిబాబు, ఆళ్ళ నాగేశ్వరరావు, కొణతాల మురళి కృష్ణ, పొలమరి శెట్టి మురళి, జాజుల రమేష్,కొణతాల భాస్కర్, పలకా రాము, పలకా రవి, పెతకం శెట్టి జగన్ మోహన్ రావు, మాధురి నాయుడు, సాధన స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ ఇస్మాయిల్, సిబ్బంది పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ బుల్ క్యాంపస్ క్రికెట్ 2020 జాతీయ ఫైనల్స్ లోకి
## రఘురామ్ ఇంజినీరింగ్ కాలేజ్

విశాఖపట్నం: విశ్వవిద్యాలయ విద్యార్థుల కోసం ఉన్న ప్రత్యేక ప్రపంచ క్రికెట్ టోర్నమెంట్ అయిన రెడ్ బుల్ క్యాంపస్ క్రికెట్ టోర్నమెంట్ లో బెంగుళూర్ జైన్ కళాశాల జట్టు ఫైనల్కు చేరుకుంది. రెడబుల్ క్యాంపస్ క్రికెట్ జాతీయ ఫైనల్లో చేరుకునేందుకు గానూ విశాఖలోని రఘురామ ఇంజినీరింగ్ కళాశాల జట్టు రీజనల్ రౌండో స్థానం సంపాదించింది. తొమ్మిదవ ఎడిషను ఫిబ్రవరిలో నగర అర్హత పోటీలు 29 నగరాల్లో జరిగినట్టు నిర్వాహకులు తెలిపారు. సిటీ రౌండ్లు, ఎలిమినేటర్స్ తరువాత ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. కళాశాల ప్రాంగణాల నుండి వర్తమాన క్రికెటర్లను తయారు చేయడానికి దీన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫ్రాంచైజ్ అయిన రాజస్థాన్ రాయల్స్ ఎనర్జీ డ్రింక్ దిగ్గజం రెడ్ బుల్ లో తమ భాగస్వామ్యం కొనసాగిస్తుందన్నారు.

# ఓసీలు అందరూ ఏకం కావాలి



నెల్లూరు : ఓసి సంగానికి రాష్ట్ర సలహాదారుడిగా నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెం మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన సారెడ్డి రాజగోపాల్ రెడ్డి ని ఎంపిక చేసి నియామకపత్రం అందజేయటం జరిగినది. నెల్లూరు పట్టణం లోని పడారుపల్లిలో జరిగిన ఓసి సంగం సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు ఈ సమావేశంలో ఓసి సంగానికి రాష్ట్ర సలహాదారుడిగా ఏకగ్రీవంగా ఎంపిక చేసి ఓసి సంగం వ్యవస్థాపక అధ్యక్షుడు కందనూరు వెంకట సుబ్బారెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం తీసుకున్నారు. ఈ సందర్భంగా కందనూరు వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ దేశంలోని అగ్రవర్ణాల పరిస్థితి చాలా అద్వాన్నంగా ఉందని అన్ని రాజకీయపార్టీలు నిరుపేద ఓసిల ఓట్లు వాడుకున్నాయి. కానీ ఏ రోజూ ఓసిల సమస్యలపైన అసెంబ్లీ లో కానీ, పార్లమెంటులో గాని మాట్లాడిన నాయకుడు పార్టీ ఇంతవరకు లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని ఓసీలు అందరూ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. నూతన సాలహాదారుడు రాజగోపాలరెడ్డి మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి స్వతహాగా అందరివాడని కానీ ఆయనకున్న సలహాదారులు క్షేత్ర స్థాయిలో ఓసిల వాస్తవ పరిస్థితి చెప్పడంలో విఫలమయ్యారని వారిని తక్షణమే తొలగించి అందరి గురించి సలహాలు ఇచ్చేవారిని నియమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓసి సంగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దల రమణారెడ్డి, నెల్లూరు నాయకులూ బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాడేరు నియోజకవర్గంలో రోడ్లు అధ్వాన్నం

## జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు యుగంధర్



కొయ్యూరు : పాడేరు నియోజకవర్గంలో రోడ్లు చాలా అధ్వాన్నంగా ఉన్నాయని జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు పండా యుగంధర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొయ్యూరు, చింతపల్లి ఘాట్ రోడ్డు, చితపల్లి, సీలేరు రోడ్లు, ఇతర ఆర్అండ్‌బి రోడ్లు చాలా దారుణంగా ఉన్నాయన్నారు. ఇటీవల పడిన వర్షాల కారణంగా ప్రయాణికులు ప్రయాణించడానికి ప్రమాదకరంగా మారాయన్నారు. ఇక పల్లెటూర్ల పరిస్థితి అయితే మరింత అధ్వాన్నంగా మారిందన్నారు. చాలా ఊర్లకు కనీస రోడ్లు సౌకర్యం లేదన్నారు. వర్షాలకు మట్టి రోడ్లు బురదమయంగా మారి ప్రజల వద్దకు అంబులెన్స్ వెళ్లటానికి వీలు లేకుండా ఉందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రికి తీసుకు వెళ్లలేకపోతున్నారని, గర్భిణీలు దారిలోనే పురిటి పోసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చాలా ఊర్లకు రోడ్లు నిర్మాణం జరిగింద న్నారు. కానీ ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే మారుమూల ఊర్లకు రోడ్లు సౌకర్యం కల్పించి ప్రస్తుతం పాడైన రోడ్లును మరమ్మత్తులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## జనవరి 1నుంచి భూముల స్వచ్ఛీకరణ

గొలుగొండ : మండలంలో జనవరి ఒకటో తేదీ నుంచి భూములు స్వచ్ఛీకరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డిప్యూటి తహాశీల్దార్ ఆనంద్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం తహాశీల్దార్ కార్యాలయంలో ఉన్న భూమి రికార్డులు ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. డైకాల్డ్ ఎఫ్ఎం బి రికార్డుల్లో నమోదు కాబడిన వివరాలు ఆన్‌లైన్ నమోదు చేసే కార్యక్రం ప్రారంభించారు. మండలంలో 36 రెవెన్యూ పంచాయతీలు ఉన్నాయని, వాటిలో ఒకటి తాండవ జలధిబంధించిన రెవెన్యూ గ్రామం అని రెండు ఇనాం రెవెన్యూ పంచాయతీ ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మిగిలిన 33 రెవెన్యూ గ్రామాల్లో జనవరి ఒకటో తేదీ నుంచి భూస్వచ్ఛీకరణ కార్యక్రమం నిర్వహించి రైతుల వద్ద ఉన్న భూమి రికార్డులు వివరాలు నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. రికార్డుల్లో నమోదు కానీ భూములు వివరాలు సిద్దం చేసి జాబితా జిల్లా కలెక్టర్‌కు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# రక్త దానంతో ప్రాణాలను కాపాడండి




ములగాడ : రక్తం అవసరం తో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం దానం చేసి ప్రాణాలను కాపాడాలని 61వ వార్డ్ తెదేపా కార్పొరేటర్ అభ్యర్థి సర్వసిద్ది శ్రీలక్ష్మి పేర్కొన్నారు. నగరంలోని ఎన్టీఆర్ భవన్ లో తెదేపా శ్రేణుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా రక్త దాన శిబిరానికి పశ్చిమ నియోజకవర్గ 61 వార్డ్ తెదేపా కార్పొరేటర్ అభ్యర్థి సర్వసిద్ది శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొని రక్త దానం చేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ రక్త దానంతో ఎంతో మందికి ప్రాణ దానం చెయ్యొచ్చునని, అపోహలు వీడి ప్రతీ ఒక్కరు రక్త దానం చేసి ఆపద లో ఉన్నవారిని ఆదుకోవాలని కోరారు.

పశ్చిమ తెదేపా శాసనసభ్యులు గణబాబు సూచనలు మేరకు, తెదేపా ఎమ్మెల్యే, వెండితెర హీరో నందమూరి బాలకృష్ణ పిలుపు మేరకు విశాఖ జిల్లా ఎన్టీఆర్ భవన్ లో జరిగిన మెగా రక్తదాన శిబిరం లో పాల్గొని రక్త దానం చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో 61వవార్డ్ నాయకులు సర్వసిద్ది శ్రీనివాసరావు, ఉరుకుటి పైడిరాజు, కార్యకర్తలు, యువత హాజరయ్యారు.



*దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నిర్వహించిన బైక్ ర్యాలీలో 38వ వార్డు కార్యకర్తలు అభిమానులు పాల్గొనడం జరిగింది. వారితో పాటు వార్డు వైస్సార్సీపీ నాయకురాలు జోన్-3 టిఎల్ఎఫ్ ప్రెసిడెంట్ బెహరా వెంకట రత్నం కూడా పాల్గొన్నారు.*



**ఆర్థికంగా బాగా చితికిపోయిన కప్పరాడకు చెందిన శ్రీదేవి, భర్త చనిపోయి ఇబ్బందుల్లో ఉన్న శ్రీదేవికు మాజీ కార్పొరేటర్ సాయిపూజ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, తెలుగుదేశం నాయకులు వానపల్లి రవికుమార్ శనివారం రైస్ బ్యాగ్ అందజేశారు. శ్రీదేవి రైల్వే కాలనీ, జి.హెచ్ స్కూల్ పూర్వ విద్యార్థి. తనకు, తన కుమారుడికి ఆరోగ్యం బాగాలేదని శ్రీదేవి తెలియజేసిన మేరకు రవికుమార్ మానవతాధృక్పదంతో స్పందించారు. ప్రతీ నెలా ఈమెకు నిత్యావసర సరుకులు ఇస్తామని తెలియజేశారు. జి.హెచ్ స్కూల్ పూర్వ విద్యార్థులు రవికుమార్ కు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివోహం మురళి, వార్డు కార్యదర్శి సారిపల్లి మహేష్,కృష్ణ,శ్రీను,రైల్వే న్యూ కాలనీ లో ఉన్న ప్రభుత్వ పాఠా శాల పూర్వ విద్యార్థులు బూర్లె రమేష్, డి. హరనాథ్, డి. ఉదయ్ కుమార్, ఆది తదితరులు పాల్గొన్నారు.**

# అక్రమ కట్టడాలు తొలగించి అభివృద్ధికి సహకరించండి

*- రాష్ట్రంలో ఆదర్శనగరంగా కడప పట్టణం...*

*- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు ఎస్‌బి.అంజాద్ భాషా*



కడప : రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా కడప పట్టణాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ బి. అంజాద్భాష పేర్కొన్నారు. శనివారం 39వ డివిజన్ మోచంపేటలో ఉప ముఖ్యమంత్రి వర్యులు ఎస్ బి. అంజాద్భాష మాజీ మేయర్ సురేష్ బాబు తో కలిసి సిమెంటు రోడ్డు, సిసి డ్రైన్ ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రివర్యులు మాట్లాడుతూ నగరంలో అక్రమ కట్టడాలు నిర్మించిన వారు వెంటనే తొలగించి అభివృద్ధికి సహకరించాలన్నారు. గతంలో నగరపాలక సంస్థ ప్లాన్ లేకుండా అనేక నిర్మాణాలు చేపట్టడం జరిగిందని ఇక ప్లాన్ లేకుండా ఇల్లు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొంతమంది డ్రైనేజీ కాలువలు, కల్వర్టులు ఆక్రమించుకోవడం వల్ల ఇళ్లలోకి డ్రైనేజీ నీరు చేరుతుందన్నారు. కడప పట్టణాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు 43 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా నేడు 39 వ డివిజన్లో 14వ ఫైనాన్స్ నిధులు 36 లక్షలతో సిసి రోడ్డు, సి సి డ్రైన్ల నిర్మాణాలకు భూమిపూజ చేయడం జరిగిందన్నారు. గత పది సంవత్సరాలుగా అభివృద్ధిలో నిర్లక్ష్యానికి గురైన కడప పట్టణం నేడు ఆదర్శ నగరంగా అభివృద్ధి చేసుకునే సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైఎస్. జగన్ మోహన్ రెడ్డి మన జిల్లావాసి కావడం మన అందరి అదృష్టమన్నారు. నగర అభివృద్ధికి ఆయన ఎన్ని నిధులైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రజలందరూ సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలన్నారు. నగరపాలక సంస్థలో విలీనమైన ప్రాంతాలన్నీ అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. పట్టణంలో ముఖ్యంగా 16 రోడ్లు వెడల్పు చేయడం జరుగుతుందని రోడ్లు వెడల్పు చేయడం వల్ల ప్రజల ప్రాపర్టీ కూడా పెరుగు తుందన్నారు. నగరంలోని 50 డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థులు అభివృద్ధి అక్రమాల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపు తున్నారని నగరాభివృద్ధికి ఇది ఒక మంచి సువర్ణవకాశమన్నారు. పాతకడప చెరువును హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేసేం దుకు ముఖ్యమంత్రివర్యులు 55 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఇక్కడ పచ్చదనాన్ని పెంపొందించి నగర ప్రజలు ఆహ్లాదకర వాతావరణంలో స్వేద తీర్చుకునే విధంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాకు ఎనలేని సేవలు చేసిన మహనీయుల విగ్రహాలు కూడా ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

మనది సీఎం జిల్లా ఈ ప్రాంతాన్ని రాష్ట్రస్థాయి లోనే ఆదర్శ నగరంగా అభివృద్ధి చేసుకునేందుకు ప్రజలందరూ కుల, మత పార్టీలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలన్నారు.

ఈ కార్యక్రమానికి ముందు ఉప ముఖ్యమంత్రి వర్యులు దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు మాసీమ బాబు, దాసరి శివప్రసాద్, 39 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి కమాల్ భాష, రాష్ట్ర మైనార్టీ సెక్రటరీ, మాజీ కార్పొరేటర్ మున్నా, 31వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అజ్మతుల్లా, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ, స్థానిక నాయకులు మౌలా, ఖాదర్బాషా, పీరు, తదితరులు పాల్గొన్నారు.

# పేకాటరాయుళ్లు అరెస్టు

## కొయ్యూరు ఎస్సై నాగేంద్ర



కొయ్యూరు : మండలంలో ఎం.మాకవరం పంచాయితీ పరిధిలో గల నడింపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామని కొయ్యూరు ఎసై దాసరి నాగేంద్ర తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు నడింపాలెం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నా తొమ్మిది మందిని శుక్రవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద రూ.3580లు స్వాదీనం చేసుకున్నామన్నారు. ఈ దాడిలో పి.సి మూర్తి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసుల సేవలు ప్రశంసనీయం

# సమాజ ప్రగతిలో కీలక పాత్ర

## పదవి విరమణ సభలో ఎంపీ ఎంవీవీ



విశాఖపట్నం : సమాజ ప్రగతి లో పోలీసులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంవీవీ సత్యనారాయణ కొనియాడారు. శనివారం ఇక్కడ డాబాగార్డెన్స్ విజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో నేవల్ డాక్ యార్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన,, పోలీస్ అధికారులు పదవీవిరమణ సభలో ఎంపీ ఎంవీవీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు,. ఈ సందర్భంగా .38 ఏళ్ళ పాటు పోలీస్ అధికారులు గా ఎటువంటి రిమార్కు లు లేకుండా సేవలు అందించిన సనపల సింహాచలం ...ఉమా మహేశ్వర రావు డేవిడ్ కిషోర్ దంపతులు ను ..ఎంపి ఎంవీవీ చేతులు మీదుగా సత్కరించారు ...ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ నిరంతరం సమాజ అభివృద్ధి కోసం పోలీసులు చేస్తున్న కృషి ,,అభినందనీయం అన్నారు .. రాత్రి పగలు తేడా లేకుండా పోలీసులు. నిరంతర శ్రామికులు గా ప్రజలు కి అందుబాటులో ఉంటూ సేవలు కొనసాగించారు అని. ఎంపీ అభివర్ణించారు,,విధులు నిర్వహణ లో పోలీసులు , ఎటువంటి విమర్శలు లేకుండా సేవలందించడం అంత ఆషామాషీ వ్యవహారం కాదు ,అని కొనియాడారు .... పదవి విరమణ చేసినప్పటికీ వారు ప్రత్యామ్నాయ మార్గాల్లో సేవలు అందించే అవకాశం ఉందన్నారు,,, సభకు అధ్యక్షత వహించిన నేవల్ డాక్ యార్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు జాతీయ జర్నలిస్ట్ ల సంఘం కార్యదర్శి ..వైజాగ్ జర్నలిస్ట్ ల ఫోరమ్ అధ్యక్షుడు ,, గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ తమ అసోసియేషన్ ద్వారా నిజాయితీ తో సేవలు అందించిన ముగ్గురు పోలీసు ఉన్నతాధికారులును సత్కరించుకోవడం,,తమకు దక్కిన అవకాశంగా భావిస్తున్నామన్నారు. భవిష్యత్తులో వారు మరింతగా మరిన్ని సేవలు అందించాలని,,, పదవి విరమణ తర్వాత కూడ వారి వారి కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో,, సుఖ సంతోషాలతో ఉండాలని తాము కోరుకుంటున్నామన్నారు. పోలీస్‌లు, కోవిడ్ లో అందించిన సేవలు నిరుపమాన మన్నారు ప్రతీ ఒక్కరు సమాజ సేవ లో తమ వంతు భాగస్వామ్యం అందించాలని శ్రీనుబాబు పిలుపునిచ్చారు ..కార్యక్రమం కి సమన్వయకర్త గా పోలీస్ విభాగం కి చెందిన ఏఎస్ఐ కొత్తపల్లి గోవిందమ్మ వ్యవహరించారు ...నేవల్ డాక్ యార్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బత్తుల చిరంజీవి, కార్యదర్శి భాస్కర్ రావు, సన్యాసిరావు, కృష్ణ రావు, రవి, జీకే ప్రసాద్, నాగార్జున రావు, శ్రీను పోలీస్ అధికారులు ..వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# విశాఖ శ్రీ శారదా పీఠంలో 'దైవజ్ఞ సమ్మేళనం'



విశాఖపట్నం : విశాఖ శ్రీ శారదాపీఠంలో నేడు ఆదివారం "దైవజ్ఞ సమ్మేళనం" నిర్వహింప బడుతుంది. విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వా మివారు మరియు ఉత్తర పీఠాధిపతులు శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామివార్ల దివ్య సమక్షంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేక మంది పంచాగ కర్తలు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. రాబోయే "ప్లవ నామ సంవత్సరం"లో పండుగలన్నీ ఏకీకృతం చేసే సాధన ఈ సభలో చేయనున్నారు. సిద్ధాంతములు ఎన్ని విధాలుగా ఉన్నా సామాన్య ప్రజలకు సైతం ఉపయుక్తమయిన పండగలు అన్ని పంచాంగముల యందు ఒకే విధంగా ఉండేటట్లు ఈ సభలో చర్చిచనున్నారు.

ఈ కార్యక్రమమును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవదాయ ధర్మదాయ శాఖ అర్చక ట్రైనింగ్ అకాడమి ద్వారా విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు సమక్షంలో ఈ సభ నిర్వహింప బడుతున్నది.

## ఉత్కంఠ పోరులో కోల్‌కత్తాదే విజయం..

న్యూఢిల్లీ : పంజాబ్‌కు మరో పరాజయం. గొప్ప ఆరంభం లభించినా ఓటమి చవి చూసింది. ఆఖరి బంతి వరకు సాగిన మ్యాచ్‌లో కోల్‌కతానే పైచేయి సాధించింది. అబుదాబి వేదికగా శనివారం పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ ప్రదర్శనతో కార్తిక్ సేన రెండు పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు వచ్చిన కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 164 పరుగులు సాధించింది. సారథి దినేశ్ కార్తిక్ (58బీ 29 బంతుల్లో, 8ఐ4, 2ఐ6) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం బరిలోకి దిగిన పంజాబ్ 20 ఓవర్లలో అయిదు వికెట్లు కోల్పోయి 162 పరుగులే చేసింది. ఓపెనర్లు కేఎల్ రాహుల్ (74బీ 58 బంతుల్లో, 6ఐ4), మయాంక్ అగర్వాల్ (56బీ 39 బంతుల్లో, 6ఐ4, 1ఐ6) అర్ధశతకాలతో పోరాడారు.

# నిబద్ధత గల నాయకుడు ద్రోణంరాజు

### రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖామాత్యులు బొత్స సత్యనారాయణ



విశాఖపట్నం : ద్రోణంరాజు శ్రీనివాస్ మరణవార్త విన్నాక బాధని వ్యక్తపరిచేందుకు తనకు మాటలు రావడం లేదని రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖామాత్యులు బొత్స సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఉదయం ఆయన స్థానిక డాక్టర్స్ కాలనీలో గల స్వర్గీయ ద్రోణంరాజు శ్రీనివాస రావు గృహాన్ని సందర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ద్రోణంరాజు శ్రీనివాసరావు సతీమణి, ఆయన కుమారుడు శ్రీవాస్తవను కలిసి పరామర్శించి మాట్లాడారు. వారి కుటుం బానికి తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్రోణంరాజు శ్రీనివాసరావు తండ్రి వారసత్వంతో పాటు నిబద్ధత గల, మచ్చ లేని నాయకుడిగా రాజకీయ విలువల్ని కొనసాగించారని అన్నారు. ద్రోణంరాజు శ్రీనివాస్ మృతి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ఉత్తరాంధ్ర ప్రజలకు తీరనిలోటని అన్నారు. ఉత్తరాంధ్ర రాజకీయ చాణుక్యుడు ద్రోణంరాజు సత్యనారాయణ కుమారుడు వీఎంఆర్డీఏ తొలి చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ ఇక లేరనే వార్త అందరినీ కలచివేసిందని, ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పిలిచే ఆ పిలుపు మూగబోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు.ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సంతాపం. ఈ విపత్కర పరీక్ష సమాయాన్ని ఎదుర్కొనేలా స్వర్గీయ ద్రోణంరాజు కుటుం బానికి ధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాననిబొత్స సత్యనారాయణతో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ ఎస్.ఏ. రెహమాన్, భరణీకాన రామారావు తదితరులు స్వర్గీయ ద్రోణంరాజు శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు. మరియు ఫోన్లో మాజీ మంత్రి వర్యులు కన్నా. లక్ష్మీనారాయణ, కిల్లి కృపారాణి , స్వర్గీయ ద్రోణంరాజుశ్రీనివాస్ సతీమణి తనయుడు శ్రీవాస్తవ తో మాట్లాడి వారి ప్రగడా సంతాపాన్ని తెలిపారు.

# అర్హులైన ప్రతీవ్యక్తికీ సంక్షేమ పథకాలు అందాలి

### జివియంసి కమిషనర్ డా. జి.సృజన



విశాఖపట్నం : సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ వ్యక్తికీ అందాలని జివిఎంసి కమిషనర్ డా. జి. సృజన ఆదేశించారు. శనివారం విఎంఆర్‌డిఎ ఎరీనా చిల్డ్రన్ థియేటర్ లో వార్డు సచివాలయ సంక్షేమ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటుచేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా పరిపాలన, సంక్షేమం, ప్రతీ పేద ఇంటికి చేరాలని ఉద్వేగంతో వార్డు సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టారన్నారు.

ఆమె సంక్షమ కార్యదర్శులతో మాట్లాడుతూ, వార్డు సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి ఒక సంవత్సరం పూర్తీ అయిందని, అందరూ క్రమశిక్షణతో పనిచేయాలని, సంక్షేమ పథకాలు ప్రతీ పేదవారికి చేరే విధంగా సంక్షేమ కార్యదర్శులు పని చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పేదవారి కోసం వై.ఎస్.ఆర్. చేయూత, జగనన్న తోడు, రైస్ కార్డు, వై.ఎస్.ఆర్. భీమా, జగనన్న విద్యా దీవన, హౌసింగ్ స్కీము, అమ్మ ఒడి, ఆసరా, నేతన్న నేస్తం, పెన్షన్ కానుక వంటి మొత్తం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని, ప్రతీ పథకం అర్హులైన పేదవారికి అందించే బాధ్యత, సంక్షేమ కార్యదర్శులపై ఉందన్నారు. నగర పరిధిలో పేద, మధ్య తరగతి ప్రజల జీవనం సాగిస్తున్నారని వారు మనల్ని నమ్ముకొని ఉన్నారని, ప్రజలకు హక్కుగా అందవలసిన అన్ని పథకాలు వారికి చేరాలని, వారికి ఆర్థిక భరోసా కల్పించి ఆర్థికంగా పైకి తీసుకురావలసిన బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం, ప్రాజెక్టు డైరెక్టర్ (యు.సి.డి.) వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ, వార్డు సచివాలయ సంక్షేమ కార్యదర్శులు నిబద్ధతతో పనిచేయాలని, పేద వారికి అందవలసిన ప్రతీ సంక్షేమ పథకం అందేవిధంగా, ఎప్పటికప్పుడు పనిచేయాలన్నారు. ముఖ్యంగా, రైస్ కార్డు, పించన్ మొదలైన అర్హులను గుర్తించాలన్నారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలు పెండింగులో ఉండకుండా చూడాలన్నారు.



ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్(యు.సి.డి.) వై. శ్రీనివాస రావుతో పాటూ, ఏ.పి.డి.లు, వార్డు సంక్షేమ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# మారటోరియం పొడగింపుపై స్పష్టత ఇచ్చిన కేంద్రం, ఆర్‌బీఐ



న్యూఢిల్లీ : మారటోరియం పొడగింపుపై కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) క్లారిటీ ఇచ్చింది. ఈ మేరకు మారటోరియం పొడగించడం కుదరదంటూ సుప్రీం కోర్టులో శనివారం సుప్రీం కోర్టులో కేంద్రం, ఆర్‌బీఐ అఫిడవిట్ దాఖలు చేశాయి. కరోనాతో ఆదాయం తగ్గిన వివిధ రంగాల వారికి మారటోరియంతో ఊరట కల్పించామని కేంద్రం పేర్కొంది. ఆర్థిక విధానాలు ప్రభుత్వానికి చెందినవని, కోర్టుల జోక్యం తగదని కేంద్రం అభిప్రాయపడింది. చక్రవడ్డీ మాఫీ మినహా ఎలాంటి ఉపశమనాలు కల్పించలేమని కేంద్రం సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రంగాల వారీగా ఉపశమనం కల్పించడం కుదరదని కేంద్రం, ఆర్‌బీఐ సుప్రీంకోర్టుకు తెలిపాయి. రుణాల చెల్లింపునకు ఇప్పటికే ఆరు నెలల మారటోరియం ప్రకటించామని చెప్పాయి. మారటోరియం మరింత పొడగించడం కుదరదని సుప్రీం కోర్టుకు సమర్పించిన వేర్వేరు అఫిడవిట్లలో కేంద్రం, ఆర్బీఐ చెప్పారు. మరింత కాలం పొడగిస్తే వాయిదాల చెల్లింపులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆర్‌బీఐ పేర్కొంది.

# యువత సామాజిక కార్యక్రమాల్లో ముందుండాలి

### ఘనంగా 54 వ వార్డు టీడీపీ యువ నాయకుడు కార్తీక్ (కుట్టా) జన్మదిన వేడుకలు



కంచరపాలెం: నేటి యువత ఉన్నత విద్య, ఫిదా రంగాలతోపటు సామాజిక కార్యక్రమాల్లో ముందుండాలని డీజీపి లీగల్ అడ్వైజర్ (మాజీ) నాగరాజు యువతకు పిలుపునిచ్చారు. శనివారం గ్రేటర్ విశాఖ 54 వ వార్డు టిడిపి యువ నాయకుడు కార్తీక్(కుట్టా) జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన డీజీపి లీగల్ అడ్వైజర్ (మాజీ) నాగరాజు ముందుగా అభిమానులు ఏర్పాటుచేసిన కేక్ను కట్ చేసి, పూల గుచ్ఛం తో కార్తీక్ కుట్టకు కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో యువత ఉన్నత విద్యతో పాటు, సామాజికంగా పరులకు సేవచేసే తత్వాన్ని కలిగి ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ పిసిసి సంయుక్త కార్యదర్శి, ఆర్ ఆర్ గ్రాండ్ అధినేత డాక్టర్ బొగ్గ శ్రీను,సందీప్ , రమేశ్వరి బాబు, మద్రిపాలెం చిన్న, బాబ్జి, మరియు కార్తీక్ కుట్టా అభిమాన సంఘ నాయకులు,బొగ్గ శ్రీను మిత్ర మండలి సభ్యులు ఇతరులు పాల్గొన్నారు.

## ఏపీలో ఒక్కరోజే 6,659 మంది రికవరీ

### కొత్తగా 5653 పాజిటివ్, 35 మరణాలు

అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా కరోనా కేసుల్లో తగ్గుదల కనిపిస్తోంది. గత 24 గంటల్లో 73,625 కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయగా.. 5,653 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య 7,50,517 కి చేరింది. కోవిడ్ బాధితుల్లో తాజాగా 6,659 మంది కోలుకున్నారు. ఇప్పటివరకు కోలుకున్నవారి మొత్తం సంఖ్య 6,97,699. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో యాక్టివ్‌గా ఉన్న కరోనా కేసుల సంఖ్య 46,624. వైరస్ బాధితుల్లో కొత్తగా 35 మంది మరణించడంతో మొత్తం మృతుల సంఖ్య 6194 కు చేరింది. ఈమేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ శనివారం హెల్త్ బులెటిన్‌లో పేర్కొంది. తాజా పరీక్షల్లో 38,619 ట్రూనాట్ పద్ధతిలో, 35,006 ర్యాపిడ్ టెస్టింగ్ పద్ధతిలో చేశామని వెల్లడించింది.

# టీడీపీ ధనిక వర్గాల పార్టీ

### విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



విశాఖపట్నం : తెలుగుదేశం పార్టీని ధనిక వర్గాల పార్టీగా విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అభివర్ణించారు. వైఎస్సార్‌సీపీ పేదల గుండె చప్పుడు వినే పార్టీ అని తెలిపారు. గణేష్ కుమార్ వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికిన సందర్భంగా విశాఖ వన్ టౌన్‌లో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. పూర్ణ మార్కెట్ దుర్గమ్మ గుడి తదితర ప్రాంతాల్లో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ప్రజలకు ఏమీ చేయలేక పోతున్నానని 16 నెలలు మదన పడ్డాడని, వైఎస్సార్‌సీపీలోకి చేరడం ఆనందంగా ఉందన్నారు. 'ఏడేళ్ల పాటు టీడీపీలో వున్నా.. అక్కడ డబ్బున్న వారికే ప్రాధాన్యత' అంటూ ఆయన మండిపడ్డారు. భవిష్యత్తుపై ముందు చూపు ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఇతర రాష్ట్రాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే నిధులు దుర్వినియోగం చేయకుండా ప్రజల్ని ఆదుకుంటున్నారని తెలిపారు. 'జలకళ' పథకం ద్వారా రైతుల జీవితాల్లో వెలుగు నింపారని వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర రాష్ట్ర రెల్లి కుల చైర్మన్ వడ్డాది మధుసూదన్ రావు, రాష్ట్ర వైస్సార్సీపీ సీనియర్ నాయకులు జాన్ వెస్లీ, అధికార ప్రతినిధులు అజయ్ కుమార్, కొండా రాజీవ్ గాంధీ, సిటీ మహిళా ప్రెసిడెంట్ గరికిన గౌరి, రాష్ట్ర వైస్సార్సీపీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, సిటీ వైస్సార్సీపీ నాయకులు, వార్డ్ ప్రెసిడెంట్స్, కార్పొరేటర్ అభ్యర్థులు, మాజీ కార్పొరేటర్స్, వందల సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.






VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com